www.aashwi.net / in PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

## సత్ఫలితలు ఇస్తున్న ధాన్యం సేకరణ



3



## ఆ సినిమా విషయంలో దర్శకుడి ప్లాన్ మొత్తం మార్చేశాను

8

రంగారెడ్డి | సంపుటి: 01 | సంచిక : 33 | మంగళవారం 02-06-2026 | పేజీలు: 08 | వెల: రూ.2

# వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి..

## సన్నద్ధతపై అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

**సెక్రటేరియట్‌లో వర్షా కాల సన్నద్ధతపై ఉన్నతస్థాయి సమీక్ష**
**నైరుతి రుతుపవనాలు, ఎల్‌నినో ప్రభావంపై అధికారుల ప్రజెంటేషన్**
**వర్షా భావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచన**
**తక్కువ నీరు అవసరమయ్యే పంటలను ప్రోత్సహించాలని ఆదేశం**
**పంట మార్పిడి విధానాలపై రైతులకు వివరించాలని సూచన**
**ప్రాజెక్టుల నిర్వహణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశం**
**గేట్లు, ఇతర మరమ్మతు పనులపై ప్రత్యేక దృష్టి**
**నిర్వహణ పనులకు అవసరమైన నిధుల తక్షణ విడుదలకు ఆదేశాలు**
**విపత్తు నిర్వహణ నిధులను నిబంధనల మేరకు వినియోగించాలని సూచన**
**ప్రాణ, ఆస్తి, పశు నష్టాల సమయంలో వెంటనే స్పందించాలని అధికారులకు ఆదేశం**



**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**
వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధత, వ్యవసాయ పరిస్థితులు, ప్రాజెక్టుల నిర్వహణ, విపత్తు నిర్వహణ చర్యలపై సెక్రటేరియట్‌లో సీఎం అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.
సమావేశంలో నైరుతి రుతుపవనాల పురోగతి, రాష్ట్రంలో నమోదయ్యే వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, వాతావరణ పరిస్థితులపై వాతావరణ శాఖ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ ఏడాది వర్షాల పరిస్థితులపై సమగ్ర అంచనాలను అధికారులకు వివరించారు.
వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా స్పందించిన సీఎం, వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశాలపై రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీరు అవసరమయ్యే పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పంట మార్పిడి విధానాల ప్రాధాన్యాన్ని రైతులకు వివరించాలని సూచించారు. భూసారాన్ని కాపాడుకోవడం, దిగుబడులు పెంచడం, నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం కోసం పంట మార్పిడి కీలకమని రైతులకు తెలియజేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో శాస్త్రీయ పద్ధతులను మరింతగా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.ఇక రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ పనులపై కూడా సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల గేట్లు, మరమ్మతులు, నిర్వహణ పనులు ఎక్కడికక్కడ ..మిగతా 2లో

# పవన్ తెలంగాణకు క్షమాపణ చెప్పాలి

**ఆ తర్వాతే ఇక్కడ అడుగు పెట్టాలి**
**పవన్ కల్యాణ్ 'నవనిర్మాణ సభ' ప్రకటనపై పొన్నం అభ్యంతరం**
**భాజపాతో ఒప్పందం మేరకే రాజకీయ నటన మొదలైందని ఆరోపణ**
**తెలంగాణను భాజపాకు తాకట్టు పెట్టడమే నవనిర్మాణమా? అని ప్రశ్న**
**హైదరాబాద్‌లో సభ నిర్వహణపై తీవ్ర విమర్శలు**
**కోనసీమ కొబ్బరి చెట్లపై చేసిన వ్యాఖ్యలను గుర్తుచేసిన మంత్రి**
**తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడారని ఆరోపణ**
**గత వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్**
**తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గతంలో చేసిన వ్యాఖ్యల ప్రస్తావన**
**రాష్ట్ర ప్రజలు అలాంటి వ్యాఖ్యలను మర్చిపోలేదని వ్యాఖ్య**
**రాజకీయ లబ్ధి కోసం తెలంగాణలో సభలు నిర్వహించడం సరికాదని విమర్శ**



**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ 'నవనిర్మాణ సభ' నిర్వహించనున్నట్లు ప్రకటించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మీడియాతో మాట్లాడిన పొన్నం ప్రభాకర్, పవన్ కల్యాణ్ రాజకీయ వైఖరిపై ..మిగతా 2లో

## ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాపై సీఐడీ ఉక్కుపాదం..

# అంతర్రాష్ట్ర రాకెట్ ఛేదన

**యువతను లక్ష్యంగా చేసుకున్న ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాపై సీఐడీ ప్రత్యేక చర్యలు**
**'డఫాబెట్' వేదికగా భారీ మోసాలకు పాల్పడిన 11 మంది అరెస్ట్**
**కరీంనగర్ బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ప్రారంభం**
**న్యూఢిల్లీ, గుజరాత్, పంజాబ్‌లలో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించిన సీఐడీ**
**అఫ్ఘానిస్థాన్‌కు చెందిన వ్యక్తి సహా 11 మంది నిర్వాహకులు అదుపులోకి**
**నిందితుల నుంచి కార్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైళ్లు, పాస్‌పోర్టులు స్వాధీనం**
**రూ.3.21 లక్షల నగదు స్వాధీనం చేసుకున్న అధికారులు**
**వివిధ రాష్ట్రాల్లో నిందితులపై 225 కేసులు నమోదు**
**యువత ఆత్మహత్యలు, ఆర్థిక నష్టాలకు కారణమవుతున్న బెట్టింగ్ యాప్స్**
**ఆన్‌లైన్ జూదంపై కఠిన చర్యలు కొనసాగుతాయని సీఐడీ హెచ్చరిక**



02

# యువత రాజకీయాలపై అవగాహన పెంచుకోవా

**సోషల్ మీడియా ప్రభావం అన్ని రంగాలపై ఉందన్న టీపీసీసీ చీఫ్**
**విశాల దృక్పథంతో పని చేయాలని రాహుల్ గాంధీ సూచన**
**యువత రాష్ట్ర, జాతీయ రాజకీయాలపై అవగాహన కలిగి ఉండాలని పిలుపు**
**మంచి విషయ పరిజ్ఞానం ఉన్నవారిని ప్రోత్సహించాలని వ్యాఖ్య**
**గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన మహేశ్‌కుమార్ గౌడ్**
**సమాజంలో చైతన్యవంతమైన చర్చలు అవసరమని అభిప్రాయం**
**నాయకత్వానికి దూరదృష్టి, ప్రజా దృక్పథం అవసరమని సూచన**
**పదవుల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యమని రాహుల్ భావించారని వ్యాఖ్య**
**2004, 2009లోనే ప్రధాని అయ్యే అవకాశం ఉన్నప్పటికీ నిరాకరించారని వెల్లడి**
**యువత ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలని సూచన**



**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**
సమాజంలోని అన్ని రంగాలపై సోషల్ మీడియా ప్రభావం గణనీయంగా పెరిగిందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. సమాచార విప్లవం నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా యువత సామాజిక, ..మిగతా 2లో

# సీబీఎస్ఈ ఫీజుల మోత.. సిలిండర్ల ధరల మంట

**కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ నిప్పులు**
**మూల్యాంకన తప్పులకు విద్యార్థులను శిక్షిస్తారా?**
**విద్యా శాఖ మంత్రిపై రాహుల్ గాంధీ ఆగ్రహం**
**డిజిటల్ కాపీ, రీ-టోటలింగ్ పేరుతో సీబీఎస్ఈ వసూళ్లు**
**తప్పు బోర్డుది.. శిక్ష పిల్లలది.. ఆదాయం ప్రభుత్వానిదా అంటూ విమర్శలు**
**ఆన్ స్క్రీన్ మార్కింగ్ వ్యవస్థలో లోపాలు**
**కోఎంప్ట్ సంస్థను కాపాడే ప్రయత్నం జరుగుతోందన్న జైరాం రమేశ్**
**విద్యాశాఖ మంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్**
**వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల ధరల పెంపుపై మండిపడ్డ హస్తం పార్టీ శ్రేణులు**
**ఐదు నెలల్లోనే వాణిజ్య సిలిండర్‌పై రూ. 1,572 మేర పెంచిన మోదీ సర్కార్**
**ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారంటూ కాంగ్రెస్ తీవ్ర విమర్శలు**

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**
సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) అవలంబిస్తున్న విధానాలపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 12వ తరగతి పరీక్షల మూల్యాంకన ప్రక్రియలో (పేపర్లు దిద్దడంలో) బోర్డు చేస్తున్న తప్పుల కారణంగా విద్యార్థులు నష్టపోతుంటే, సీబీఎస్ఈ మాత్రం ఆ తప్పులను ..మిగతా 2లో



# నిరుద్యోగులకు గుడ్ న్యూస్

ఇకపై ప్రతి నెలా రెండు, మూడు ఉద్యోగ నోటిఫికేషన్లు!
నిరుద్యోగ యువతకు టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం బంపర్ ఆఫర్
నేడు 3 నోటిఫికేషన్లు.. ఈ ఒక్క నెలలోనే మొత్తం 5 నుండి 6 నోటిఫికేషన్ల విడుదల
3,800 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్.. అందులో 1,393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలు
ఓఎంఆర్ పద్ధతికి స్వస్తి.. ఇకపై కంప్యూటర్ బేస్డ్ (ఆన్‌లైన్) పరీక్షల నిర్వహణే లక్ష్యం
గంట ముందే ప్రశ్నాపత్రం తయారీ.. పేపర్ లీకేజీలకు అడ్డుకట్ట వేసేలా సరికొత్త సంస్కరణలు
పరీక్ష రాసిన వెంటనే మార్కులు తెలిసే వెసులుబాటు.. ఆన్‌లైన్ పరీక్షలకు సిద్ధమవ్వాలన్న చైర్మన్
మీడియా ద్వారా ఎప్పటికప్పుడు అభ్యర్థులకు సమాచారం.. అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి



**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**
తెలంగాణలో కొలువుల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) సరికొత్త ఏడాదిలో అత్యంత తియ్యటి వార్తను అందించింది. కమిషన్ నూతన కార్యాచరణను వెల్లడిస్తూ, నిరుద్యోగుల్లో సరికొత్త ఆశలు రేకెత్తించింది. ఇకపై నోటిఫికేషన్ల కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండా, ప్రతి నెలా నిరంతరాయంగా ఉద్యోగ ప్రకటనలు విడుదల ..మిగతా 3లో

# ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్‌రావు
చివరి గింజ వరకు కొంటామని చెప్పి రైతులను నిరాశపరిచారని విమర్శ
రైస్ మిల్లర్లతో ప్రభుత్వం కుమ్మక్కైందని ఆరోపణ
రాష్ట్ర నిర్లక్ష్యంతో ధాన్యం రోడ్లపై కుప్పలుగా పడిందని వ్యాఖ్య
కేంద్రం నేరుగా వడ్లు కొనదని స్పష్టీకరణ
రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికే రీయింబర్స్‌మెంట్ ఉంటుందన్నారు
బీజేపీ ఆందోళనలతోనే ప్రభుత్వం స్పందించిందని వెల్లడి
పంట ఉత్పత్తి వివరాలు కేంద్రానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్న
రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్
ఢిల్లీలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తామని ప్రకటన
ఈటలపై పోస్టర్ల వెనుక కుట్ర కోణం ఉందని ఆరోపణ

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్**
తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల వద్ద ఉన్న చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. సోమవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లలేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్ల లోపం, రవాణా సమస్యలు, నిల్వ సదుపాయాల కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో ధాన్యం రోడ్లపైనే కుప్పలుగా పడివుండటం ప్రభుత్వ ..మిగతా 2లో



## పవన్ తెలంగాణకు క్షమాపణ చెప్పాలి

మొదటిపేజీ తరువాయి



ప్రశ్నలు లేవనెత్తారు. భాజపాతో చేసుకున్న ఒప్పందాల మేరకే పవన్ కల్యాణ్ తన రాజకీయ నటనను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో నిర్వహించబోయే నవనిర్మాణ సభ వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని విమర్శించారు.

తెలంగాణను భాజపాకు తాకట్టు పెట్టడమే పవన్ కల్యాణ్ చెప్పే నవనిర్మాణమా అని పొన్నం ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, భావోద్వేగాలను గౌరవించకుండా రాజకీయ వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించవద్దని సూచించారు. గతంలో పవన్ కల్యాణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలను కూడా పొన్నం ప్రస్తావించారు. తెలంగాణ ప్రజల దిష్టి తగిలి కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. అలాంటి వ్యాఖ్యలు తెలంగాణ ప్రజలను అవమానించేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలపై తెలంగాణ ప్రజలకు పవన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో పవన్ కల్యాణ్ తీసుకున్న వైఖరిని కూడా మంత్రి ప్రస్తావించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తాను 11 రోజుల పాటు అన్నం మానేశానని పవన్ కల్యాణ్ గతంలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి అభిప్రాయాలు వ్యక్తం చేసిన వ్యక్తి ఇప్పుడు తెలంగాణలో నవనిర్మాణం గురించి మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగుతోందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం, స్వాభిమానాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను సహించబోమన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ భావోద్వేగాలను ఉపయోగించుకోవాలని ఎవరైనా ప్రయత్నిస్తే ప్రజలు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. హైదరాబాద్‌లో సభలు నిర్వహించడం ప్రతి ఒక్కరి హక్కేనని, అయితే తెలంగాణ ప్రజల భావాలను గౌరవించే బాధ్యత కూడా రాజకీయ నాయకులపై ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. గతంలో చేసిన వ్యాఖ్యలపై స్పష్టత ఇవ్వకుండా కొత్త రాజకీయ కార్యక్రమాలతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నాలు ఫలించవని అన్నారు. తెలంగాణ ప్రజలకు గౌరవం ఇచ్చే విధంగా వ్యవహరించాలని పవన్ కల్యాణ్‌కు సూచించారు.

# వర్షా కాలం అప్రమత్తంగా ఉండాలి..

మొదటిపేజీ తరువాయి



పెండింగ్‌లో లేకుండా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రాజెక్టుల నిర్వహణకు అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. నిధుల కొరత కారణంగా ఎలాంటి పనులు నిలిచిపోకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు సంబంధించిన అంశాల్లో రాజీ ఉండబోదని పేర్కొన్నారు.విపత్తు నిర్వహణ అంశాలపై కూడా సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. విపత్తు నిర్వహణ శాఖ వద్ద అందుబాటులో ఉన్న రూ.1,000 కోట్ల నిధులను నిబంధనల మేరకు అవసరమైన చోట వినియోగించాలని సూచించారు. వర్షాలు, వరదలు, ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం సంభవించే ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులు, కూలిపోయిన వంతెనల పునర్నిర్మాణానికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం సూచించారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా వేగంగా మరమ్మతు పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం సంభవించినప్పుడు అధికారులు వెంటనే స్పందించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాధితులకు తక్షణ సహాయం అందించడంతో పాటు పునరావాస చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. విపత్తుల సమయంలో శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ, నీటిపారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆరోగ్య, హోం, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొని వర్షాకాల సన్నద్ధతపై తమ శాఖల కార్యాచరణ ప్రణాళికలను వివరించారు. రాష్ట్రంలో వర్షాకాల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు.

### ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాపై సీఐడీ ఉక్కుపాదం..

# అంతర్రాష్ట్ర రాకెట్ ఛేదన




- యువతను లక్ష్యంగా చేసుకున్న ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాపై సీఐడీ ప్రత్యేక చర్యలు
- 'డఫాబెట్' వేదికగా భారీ మోసాలకు పాల్పడిన 11 మంది అరెస్ట్
- కరీంనగర్ బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ప్రారంభం
- న్యూఢిల్లీ, గుజరాత్, పంజాబ్‌లలో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించిన సీఐడీ
- అఫ్గానిస్థాన్‌కు చెందిన వ్యక్తి సహా 11 మంది నిర్వాహకులు అదుపులోకి
- నిందితుల నుంచి కార్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైళ్లు, పాస్‌పోర్టులు స్వాధీనం
- రూ.3.21 లక్షల నగదు స్వాధీనం చేసుకున్న అధికారులు
- వివిధ రాష్ట్రాల్లో నిందితులపై 225 కేసులు నమోదు
- యువత ఆత్మహత్యలు, ఆర్థిక నష్టాలకు కారణమవుతున్న బెట్టింగ్ యాప్స్
- ఆన్‌లైన్ జూదంపై కఠిన చర్యలు కొనసాగుతాయని సీఐడీ హెచ్చరిక

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

ఆర్థికంగా ప్రజలను దెబ్బతీస్తూ, ముఖ్యంగా యువతను అప్పుల ఊబిలోకి నెట్టడంతో పాటు ఆత్మహత్యలకు కూడా కారణమవుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లపై తెలంగాణ సీఐడీ ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలను అరికట్టేందుకు ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసిన సీఐడీ, తాజాగా నిర్వహించిన కీలక ఆపరేషన్‌లో అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న బెట్టింగ్ ముఠాను ఛేదించింది. 'డఫాబెట్' పేరుతో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా భారీ మోసాలకు పాల్పడుతున్న 11 మంది నిందితులను సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. కరీంనగర్‌కు చెందిన ఓ బాధితుడు ఈ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లో దాదాపు రూ.10 లక్షలు కోల్పోయిన నేపథ్యంలో నమోదు చేసిన కేసు దర్యాప్తులో ఈ కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి.

ఫిర్యాదు అందిన వెంటనే సీఐడీ అధికారులు విస్తృత దర్యాప్తు చేపట్టారు. నిందితుల కార్యకలాపాలు పలు రాష్ట్రాలకు విస్తరించి ఉండటంతో ప్రత్యేక బృందాలను న్యూఢిల్లీ, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాలకు పంపి సమన్వయంతో ఆపరేషన్ నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐడీ చీఫ్ చారు సిన్హా మాట్లాడుతూ, అరెస్టు చేసిన వారిలో అఫ్గానిస్థాన్‌కు చెందిన ఒక వ్యక్తి కూడా ఉన్నట్లు తెలిపారు. వీరంతా డఫాబెట్ బెట్టింగ్ వ్యవస్థను నిర్వహిస్తూ, ఆన్‌లైన్ ద్వారా వేలాది మందిని ఆకర్షించి అక్రమ లావాదేవీలు నిర్వహిస్తున్న ప్రధాన నిర్వాహకులని వెల్లడించారు.

నిందితుల నుంచి మూడు కార్లు, ఎనిమిది ల్యాప్‌టాప్‌లు, 26 మొబైల్ ఫోన్లు, ఐదు పాస్‌పోర్టులు, రూ.3.21 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాల్లో భారీ స్థాయిలో డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన సమాచారం లభించినట్లు తెలుస్తోంది. వీటి ఆధారంగా మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తులో నిందితులపై దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే అనేక కేసులు నమోదైనట్లు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో కలిపి మొత్తం 225 కేసులు ఉన్నట్లు సీఐడీ వెల్లడించింది. దీంతో ఈ ముఠా కార్యకలాపాల విస్తృతి, నిర్వహణ స్థాయి ఎంత పెద్దదో స్పష్టమవుతోందని అధికారులు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు సులభంగా డబ్బు సంపాదించవచ్చనే ఆశ చూపించి యువతను ఆకర్షిస్తున్నాయని, చివరకు వారిని భారీ ఆర్థిక నష్టాలకు గురిచేస్తున్నాయని సీఐడీ అధికారులు తెలిపారు. చాలామంది యువకులు అప్పుల పాలై తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతుండగా, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం, అక్రమ గేమింగ్ కార్యకలాపాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన వైఖరితో ముందుకు సాగుతోందని అధికారులు స్పష్టం చేశారు. ఇలాంటి ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్సహించే వారు, నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ప్రజలు కూడా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని, మోసపోయినట్లయితే వెంటనే పోలీసులకు లేదా సీఐడీకి ఫిర్యాదు చేయాలని సూచించారు.

## సీబీఎస్ఈ ఫీజుల మోత.. సిలిండర్ల ధరల మంట

మొదటిపేజీ తరువాయి

వ్యాపారంగా మార్చుకుని లాభపడుతోందని ఆయన ఆరోపించారు. ఫలితాలు విడుదలైన తర్వాత బోర్డు వసూలు చేస్తున్న వివిధ రకాల ఫీజుల విధానం పూర్తిగా విద్యార్థుల జేబులకు చిల్లు పెట్టేలా ఉందని మండిపడ్డారు. బోర్డు చేసిన తప్పులను సరిదిద్దుకోవడానికి విద్యార్థులు భారీగా డబ్బులు చెల్లించాల్సి రావడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఎక్స్‌లో ఒక సుదీర్ఘమైన పోస్టును షేర్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

విద్యార్థులనుద్దేశించి రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో తిరుగుతున్న జేబు దొంగల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని, అలాంటి వారు ఇప్పుడు సీబీఎస్ఈ బోర్డులోనే తిష్ట వేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. సీబీఎస్ఈ సిబ్బంది లేదా వారు ఉపయోగించే వ్యవస్థలు చేసే పొరపాట్ల వల్ల విద్యార్థులకు మార్కులు తక్కువగా వస్తే, దానికి బాధ్యత వహించాల్సిన బోర్డు, రివర్స్‌లో విద్యార్థులకే భారీ బిల్లులను పంపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జవాబు పత్రాలను సరిగ్గా దిద్దకపోవడం బోర్డు తప్పిదమని, కానీ దాన్ని సరిచేసుకోవడానికి పిల్లల నుండి వేల రూపాయలు వసూలు చేయడం దోపిడీ కిందకే వస్తుందని ఆయన స్పష్టం చేశారు. విద్యను ఒక సేవా మార్గంగా చూడకుండా, కేవలం లాభాలు ఆర్జించే వ్యాపారంగా మార్చడం వల్లే ఇటువంటి అనర్థాలు జరుగుతున్నాయని రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ సందర్భంగా సీబీఎస్ఈ వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను రాహుల్ గాంధీ లెక్కలతో సహా వివరించారు. విద్యార్థులు తమ డిజిటల్ స్కాన్ కాపీని అభ్యర్థించడానికి ఒక్కో సబ్జెక్టుకు రూ.100, అలాగే రీటోటలింగ్ (మార్కుల లెక్కింపు) కోసం ఒక్కో పేపర్‌కు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారని తెలిపారు. వీటన్నింటికీ మించి రీవాల్యుయేషన్ (పునఃమూల్యాంకనం) చేయించుకోవాలంటే ఒక్కో ప్రశ్నకు ఏకంగా రూ.25 చొప్పున కట్టించుకుంటున్నారని మండిపడ్డారు. ఈ లెక్కన ఒక విద్యార్థి తన సొంత జవాబు పత్రాన్ని బోర్డు చేసిన తప్పుల నుండి కాపాడుకుని, సరిగ్గా దిద్దించుకోవడానికి సుమారు రూ.2000 వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా దాదాపు 4 లక్షల మంది విద్యార్థులు ఇలాంటి దరఖాస్తులు చేసుకుంటే, సీబీఎస్ఈ బోర్డుకు ఎంత ఆదాయం సమకూరుతుందో ప్రజలంతా ఒక్కసారి ఆలోచించాలని ఆయన కోరారు.

ఆన్ స్క్రీన్ మరియు ఫోన్ల ద్వారా స్కాన్ చేసి పేపర్లు మూల్యాంకనం చేసే విధానంలో తప్పుడు మార్కింగ్ అనేది అనివార్యంగా జరుగుతోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అయితే సాంకేతిక లోపాలు లేదా మానవ తప్పిదాల వల్ల జరిగిన తప్పులను సరిచేసుకోవడానికి అయ్యే ఖర్చును విద్యార్థులపైనే నెట్టడం ఘోరమన్నారు. "ఇక్కడ తప్పు చేసింది సీబీఎస్ఈ బోర్డు, కానీ దానికి శిక్ష అనుభవిస్తోంది మాత్రం అమాయక విద్యార్థులు. చివరకు ఈ తప్పుల ద్వారా వచ్చే ఆదాయం ప్రభుత్వ ఖాతాలోకి వెళ్తోంది" అంటూ ఆయన తీవ్ర వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వ్యాపార ధోరణి పెరిగిపోయినప్పుడు వ్యవస్థలో తప్పులు సరికావని, అవి మరింతగా రెట్టింపు అవుతాయని, ఆ తప్పులకు మన దేశ భవిష్యత్తు అయిన పిల్లలే తమ మానసిక ప్రశాంతతను, డబ్బును కోల్పోతూ అత్యధిక మూల్యం చెల్లిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, సీబీఎస్ఈ ఆన్ స్క్రీన్ మార్కింగ్ వ్యవస్థలో (ఓఎస్ఎం) చోటుచేసుకున్న భద్రతా లోపాలపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ జైరాం రమేశ్ కూడా మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తమ ఆన్ స్క్రీన్ మార్కింగ్ వ్యవస్థలో తీవ్రమైన సైబర్ సెక్యూరిటీ లోపాలు ఉన్నాయనే విషయాన్ని కొన్ని వారాల ఆలస్యంగానైనా సీబీఎస్ఈ అంగీకరించిందని ఆయన గుర్తు చేశారు. అయితే ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే, ఈ లోపాలకు కారణమైన సీబీఎస్ఈ కాంట్రాక్ట్ సంస్థ 'కోఎంప్ట్' పై ప్రభుత్వం ఎందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన నిలదీశారు. నిబంధనలను ఉల్లంఘించిన లేదా సరిగ్గా పనిచేయని సంస్థలను వెండర్ల జాబితా నుండి తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, సదరు ప్రైవేట్ సంస్థను కాపాడటానికే బోర్డు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో జరిగిన అంతర్గత మార్పులను జైరాం రమేశ్ బయటపెట్టారు. 2025 ఆగస్టు నాటి తన ఆర్ఎఫ్‌పీ (RFP) నిబంధనల ప్రకారం, సమర్థవంతంగా పనిచేయని లేదా లోపాలకు కారణమైన వెండర్లను బ్లాక్‌లిస్ట్ చేసే పూర్తి అధికారాన్ని సీబీఎస్ఈ తన వద్ద ఉంచుకుందని చెప్పారు. అయితే విచిత్రంగా, గతేడాది సెప్టెంబర్ నెలలో సీబీఎస్ఈ ఒక ప్రత్యేక సవరణను తీసుకువచ్చిందని, ఆ సవరణ ద్వారా వెండర్లను బ్లాక్‌లిస్ట్ చేసే తన సొంత అధికారాన్నే తానే స్వచ్ఛందంగా తొలగించుకుందని ఆయన ధ్వజమెత్తారు. ఈ నిర్ణయం వెనుక సదరు 'కోఎంప్ట్' సంస్థను ఎలాగైనా కాపాడాలనే ప్రభుత్వ పెద్దల హస్తం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. ప్రైవేట్ కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను, వారి మానసిక ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారని మండిపడ్డారు.

దేశంలోని విద్యావ్యవస్థను, ముఖ్యంగా ప్రతిష్టాత్మక పరీక్షల బోర్డులను సమర్థవంతంగా నిర్వహించడంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారని జైరాం రమేశ్ ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మంత్రిమండలి సహచరులను ఎన్నడూ నిజాయితీగా, నైతిక ప్రమాణాలకు లోబడి పనిచేసేలా చూడలేదని విమర్శించారు. కనీసం ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి తన అసమర్థతను ఒప్పుకుని, రాజధర్మాన్ని పాటించి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్లు లీక్ కావడం, మూల్యాంకనంలో అవకతవకలు జరగడం వల్ల దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, ఇలాంటి అసమర్థ మంత్రిని దేశం ఇంకెంతకాలం భరించాల్సి ఉంటుందో ప్రధాని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల సమస్యలతో పాటు, దేశంలో సామాన్యుడిపై పడుతున్న ధరల భారాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. దేశంలో వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరలను మరోమారు పెంచడంపై కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి 'ద్రవ్యోల్బణ మనిషి' అంటూ కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో గట్టిగా విమర్శించింది. దేశంలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో విఫలమైన ప్రధాని, ప్రజలపై మళ్లీ ధరల కొరడా ఝుళిపించారని ఆరోపించింది. ఈ రోజు వాణిజ్య సిలిండర్ ధరను రూ. 53.50 మేర పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొంది. ఈ ఏడాది ఇంకా పూర్తి కాకముందే, కేవలం గత ఐదు నెలల కాలంలోనే వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను ఏకంగా రూ. 1,572 మేర పెంచి ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ మండిపడింది.


## యువత రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలి

మొదటిపేజీ తరువాయి

రాజకీయ అంశాలపై మరింత అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.

హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన సూచనలను ప్రస్తావిస్తూ, సంకుచిత మనస్తత్వాన్ని వీడి విశాల దృక్పథంతో పని చేయాలని ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారని తెలిపారు. రాష్ట్ర, దేశ రాజకీయాలపై యువతకు సరైన అవగాహన ఉండాలని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. రాజకీయ పరిణామాలు, ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగ విలువలపై యువత అధ్యయనం చేయడం అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్ నాయకత్వం యువత నుంచే రావాల్సి ఉన్నందున వారు సమాజ సమస్యలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

మంచి విషయ పరిజ్ఞానం ఉండి, సమాజానికి ఉపయోగపడే అంశాలపై స్పష్టంగా మాట్లాడగలిగే వ్యక్తులను ప్రోత్సహించాలని రాహుల్ గాంధీ సూచించినట్లు తెలిపారు. ప్రజలతో మమేకమై పనిచేసే నాయకత్వాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా సమాజాభివృద్ధి కోసం ఆలోచించే వ్యక్తులకు అవకాశాలు కల్పించాలని అభిప్రాయపడ్డారు. రాహుల్ గాంధీ రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావించిన మహేశ్‌కుమార్ గౌడ్, ఆయనకు వ్యక్తిగత స్వార్థం ఉంటే 2004 లేదా 2009 సంవత్సరాల్లోనే ప్రధానమంత్రి అయ్యే అవకాశం ఉండేదని అన్నారు. అయితే పదవుల కంటే దేశ ప్రయోజనాలకే ఆయన అధిక ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం వంటి అంశాలనే రాహుల్ గాంధీ తన రాజకీయ జీవితంలో ప్రధానంగా ముందుకు తీసుకెళ్తున్నారని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. యువత కూడా అదే స్ఫూర్తితో సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సోషల్ మీడియా యుగంలో సమాచారాన్ని విమర్శనాత్మక దృక్పథంతో పరిశీలించే అలవాటు పెంపొందించుకోవాలని, వాస్తవాలను గుర్తించి సమాజ ప్రయోజనాలకు అనుగుణంగా స్పందించాలని యువతకు సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి చైతన్యవంతమైన యువశక్తి అవసరమని మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మొదటిపేజీ తరువాయి

వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. రైస్ మిల్లర్లతో ప్రభుత్వం కుమ్మక్కైందనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయని రాంచందర్‌రావు అన్నారు. రైతుల ప్రయోజనాల కంటే ఇతర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు తక్షణ ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వంపై అనవసర ఆరోపణలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. కేంద్రం నేరుగా వడ్లను కొనుగోలు చేయదని, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేసిన ధాన్యానికి మాత్రమే రీయింబర్స్‌మెంట్ అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రజలకు పూర్తి సమాచారం ఇవ్వకుండా కేంద్రంపై నెపం మోపడం సరికాదన్నారు.

రాష్ట్రంలో ఎంత మేరకు పంట ఉత్పత్తి జరిగిందనే వివరాలను కేంద్రానికి ఎందుకు తెలియజేయలేదని రాంచందర్‌రావు ప్రశ్నించారు. ముందస్తు అంచనాలు, ప్రణాళికలు సక్రమంగా అమలు చేసి ఉంటే రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చేదే కాదన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం రైతులు తమ పంటను విక్రయించేందుకు రోజుల తరబడి ఎదురు చూస్తున్నారని ఆయన తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలకు సరిపడా లారీలు లేకపోవడం వల్ల ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతోందన్నారు. ఈ కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోళ్ల అంశంపై బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనల తర్వాతే ప్రభుత్వం స్పందించడం ప్రారంభించిందని రాంచందర్‌రావు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపించడం, ఇతర చర్యలు చేపట్టడం బీజేపీ ఒత్తిడి ఫలితమేనని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం కొనసాగితే రైతులకు మరింత నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకోవాలని కోరారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఢిల్లీలో ఘనంగా నిర్వహించనున్నట్లు రాంచందర్‌రావు వెల్లడించారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పలువురు జాతీయ నాయకులు పాల్గొంటారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జరిగిన ఉద్యమాన్ని స్మరించుకుంటూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి బీజేపీ జాతీయ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో పార్టీ మరింత విస్తరించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బీజేపీ ఎదుగుతుందని చెప్పారు.

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా ఇటీవల వెలుగులోకి వచ్చిన పోస్టర్ల అంశంపైనా రాంచందర్‌రావు స్పందించారు. ఆ పోస్టర్లకు పార్టీ అంతర్గత వ్యవహారాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బీజేపీలో విభేదాలు ఉన్నాయనే ప్రచారం సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా ఈ చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే డీజీపీ, పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. పోస్టర్ల వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. పార్టీ నాయకుల ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీ బలోపేతాన్ని అడ్డుకునేందుకు కొందరు కుట్రలు చేస్తున్నప్పటికీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని రాంచందర్‌రావు పిలుపునిచ్చారు.

# నిరుద్యోగులకు గుడ్ న్యూస్

మొదటిపేజీ తరువాయి



చేస్తామని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం అధికారికంగా ప్రకటించారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను వీలైనంత త్వరగా భర్తీ చేయడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని లక్షలాది మంది పోటీ పరీక్షల అభ్యర్థులకు పెద్ద ఉపశమనం లభించనుంది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో భాగంగా టీజీపీఎస్సీ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. ఇందులో భాగంగానే నేడు ఒకేసారి 3 కీలక ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయబోతున్నట్లు చైర్మన్ బుర్రా వెంకటేశం వెల్లడించారు. అంతేకాకుండా, ఈ ఒక్క నెలలోనే అభ్యర్థులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తూ మొత్తం 5 నుండి 6 నోటిఫికేషన్లను జారీ చేయడానికి బోర్డు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. సుదీర్ఘ కాలంగా ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లలో మగ్గుతున్న అభ్యర్థులకు ఈ నెల వరుస నోటిఫికేషన్లతో సరికొత్త ఉత్సాహాన్ని ఇవ్వనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక నుండి అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను మరింత ముమ్మరం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో వివిధ శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న సుమారు 3,800 ఉద్యోగ పోస్టుల భర్తీకి సంబంధించి ఆర్థిక శాఖ నుండి అధికారికంగా అన్ని అనుమతులు లభించాయని బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఈ మొత్తం పోస్టులలో అత్యధికంగా అటవీ శాఖకు సంబంధించిన ఉద్యోగాలే ఉన్నాయని ఆయన వివరించారు. ముఖ్యంగా నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న 1,393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు ఇందులో ఉన్నాయని, వీటికి సంబంధించిన అర్హతలు, సిలబస్ వివరాలతో కూడిన నోటిఫికేషన్ త్వరలోనే అందుబాటులోకి వస్తుందని చెప్పారు. భద్రత, క్షేత్రస్థాయి విధులకు సంబంధించిన ఈ పోస్టుల భర్తీని అత్యంత పారదర్శకంగా పూర్తి చేస్తామన్నారు.

కేవలం వేల సంఖ్యలో ఉన్న పెద్ద నోటిఫికేషన్లనే కాకుండా, ప్రభుత్వ శాఖల్లో ఎక్కడ చిన్న ఖాళీ ఉన్నా వాటిని భర్తీ చేయడానికి కమిషన్ నడుం కట్టిందని చైర్మన్ తెలిపారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ విభాగాల్లో కేవలం ఒక్కొక్క ఖాళీ మాత్రమే ఉన్న 28 రకాల ప్రత్యేక పోస్టులు ఉన్నాయని, వాటిని కూడా భర్తీ చేస్తామని చెప్పారు. వీటితో పాటు 5 కంటే తక్కువ సంఖ్యలో ఖాళీలు ఉన్న మరో 25 రకాల ఉద్యోగ పోస్టులు కూడా తమ పరిశీలనలో ఉన్నాయని బుర్రా వెంకటేశం వెల్లడించారు. ఖాళీల సంఖ్య ఎంత తక్కువగా ఉన్నప్పటికీ, ఏ ఒక్క పోస్టును వదలకుండా నిరుద్యోగులకు లబ్ధి చేకూర్చేలా అన్నింటికీ వరుసగా నోటిఫికేషన్లు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణలో గతంలో జరిగిన కొన్ని చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, పరీక్షల నిర్వహణ విధానంలో టీజీపీఎస్సీ విప్లవాత్మక మార్పులు మరియు సంస్కరణలు తీసుకువస్తోందని చైర్మన్ వివరించారు. ఇందులో భాగంగా సాంప్రదాయ పేపర్‌పెన్ పద్ధతిని పక్కన పెట్టి, పూర్తిగా కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహణ దిశగా కమిషన్ అడుగులు వేస్తోందని చెప్పారు. భవిష్యత్తులో జరగబోయే పోటీ పరీక్షలు దాదాపుగా ఈ డిజిటల్ విధానంలోనే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కొత్త సంస్కరణల ద్వారా పరీక్షల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నూటికి నూరు శాతం పారదర్శకతను తీసుకురావడమే తమ ధ్యేయమని బుర్రా వెంకటేశం పేర్కొన్నారు.

కంప్యూటర్ బేస్డ్ పరీక్షల వల్ల కలిగే అద్భుతమైన ప్రయోజనాలను చైర్మన్ ఈ సందర్భంగా మీడియాకు వివరించారు. పాత పద్ధతిలో ప్రింటింగ్ ప్రెస్‌ల ద్వారా పేపర్లు ముద్రించడం, వాటిని జిల్లాలకు తరలించడం వల్ల లీకేజీల భయం ఉండేదన్నారు. కానీ, ఈ సరికొత్త ఆన్‌లైన్ విధానంలో పరీక్ష ప్రారంభానికి కేవలం ఒక గంట ముందు మాత్రమే అత్యంత సురక్షితంగా ప్రశ్నాపత్రాన్ని డిజిటల్‌గా తయారు చేసే సాంకేతికత అందుబాటులో ఉంటుందని తెలిపారు. దీనివల్ల ఎలాంటి పేపర్ లీకేజీలకు ఆస్కారం ఉండదని, మేధావుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుందని చెప్పారు. ఈ విధానం ద్వారా నిరుద్యోగుల్లో కమిషన్ పట్ల నమ్మకం మరింత పెరుగుతుందన్నారు.

ఆన్‌లైన్ పరీక్షల వల్ల సమయం వృథా కాకుండా ఉండటమే కాకుండా, అభ్యర్థులకు తమ ఫలితాలు కూడా చాలా వేగంగా అందుతాయని బుర్రా వెంకటేశం తెలిపారు. పాత ఓఎంఆర్ షీట్ల పద్ధతిలో స్కానింగ్, వాల్యుయేషన్ చేయడం చాలా క్లిష్టమైన మరియు సుదీర్ఘమైన ప్రక్రియతో కూడుకున్నదని, దానికి భిన్నంగా కంప్యూటర్ విధానంలో పరీక్ష రాసిన వెంటనే అభ్యర్థులకు వారి మార్కులు సులభంగా తెలిసే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. అందువల్ల అభ్యర్థులందరూ ఇప్పటి నుంచే కంప్యూటర్ ఆధారిత పరీక్షలు రాయడానికి మానసికంగా, సాంకేతికంగా అలవాటు పడాలని, భవిష్యత్తు పరీక్షలన్నీ గరిష్టంగా ఈ ఆన్‌లైన్ విధానంలోనే ఉంటాయని ఆయన ఖచ్చితంగా చెప్పారు.

టీజీపీఎస్సీ పనితీరుపై సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లపై చైర్మన్ గట్టిగా స్పందించారు. కమిషన్ చుట్టూ ఎప్పుడూ కొందరు కావాలనే అసత్య ప్రచారాలు చేస్తూ అభ్యర్థులను అయోమయానికి గురిచేస్తుంటారని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. తాము పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, అందులో భాగంగానే ఇకపై ప్రతి 2 లేదా 3 నెలలకోసారి స్వయంగా మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి అన్ని విషయాలను బహిరంగంగా వెల్లడిస్తామని చెప్పారు. "మీడియాతో మాట్లాడకుండా దాగుడుమూతలు ఆడటం కంటే, నేరుగా మాట్లాడి అభ్యర్థుల సందేహాలను తీర్చడమే మంచిదని మా బోర్డు భావించింది" అని బుర్రా వెంకటేశం అన్నారు. చివరగా ఆయన ప్రాధాన్యతలను వివరిస్తూ, లక్షలాది మంది పరీక్షలు రాసినప్పుడు ఉద్యోగాలు వచ్చిన వారి కంటే రాని వారి సంఖ్యే ఎప్పుడూ ఎక్కువగా ఉంటుందని, రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడం ఏ బోర్డుకైనా అసాధ్యమైన విషయమని గుర్తు చేశారు. అందరినీ ఒకేసారి మెప్పించడం తమకు సాధ్యం కాకపోయినప్పటికీ, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా, ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా తమ క్లిష్టమైన విధులను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహిస్తామని బుర్రా వెంకటేశం నిరుద్యోగ లోకానికి హామీ ఇచ్చారు.

# బోథ్ మిత్ర యూత్ ఆధ్వర్య లో అగ్ని వీరులకు ఘనంగా సన్మానం

బోథ్ మండల కేంద్రం లోని పోచమ్మ గల్లికి చెందిన సిందేకర్.అమూల్, నాగుల. అక్షయ్. అగ్ని వీర్ సైన్యంలో కొలువు సాధించి బోథ్ పట్టణానికి గర్వకారణంగా నిలిచారు వీరికి మిత్ర యూత్ పోచమ్మ గల్లీ ఆధ్వర్యంలో ఘనంగా శాలవలతో సన్మానించడం జరిగినది ఈ కార్యక్రమంలో మిత్ర యూత్ సభ్యులు మరియు గల్లి పెద్దలు పాల్గొన్నారు



# హిమాలయాల్లో సిద్దిపేట వాసుల సేవలు

- లక్షలాది మంది భక్తులకు అన్నదానం
- ప్రశంసలు అందుకుంటున్న సిద్దిపేట కేదార్‌నాథ్ సేవా సమితి

**సిద్దిపేట, జూన్ 1 (ఆశ్వి అప్డేట్స్):**

హిమాలయ పర్వత శ్రేణుల్లోని పవిత్ర కేదార్‌నాథ్ ధామంలో సిద్దిపేట వాసులు అందిస్తున్న సేవలు దేశవ్యాప్తంగా భక్తుల ప్రశంసలు అందుకుంటున్నాయి. "అన్నదానం మహాదానం" అనే భారతీయ సంస్కృతిని ఆచరణలో చూపిస్తూ, కేదార్‌నాథ్ యాత్రకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఉచితంగా అన్నపానీయాలు, తాగునీరు, టీ, టిఫిన్స్, భోజనం అందిస్తూ సిద్దిపేట కేదార్‌నాథ్ అన్న సేవా సమితి ఆధ్వర్యంలో హిమాలయాల్లో కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలపై "ఆశ్వి అప్డేట్స్" ప్రత్యేక కథనం.... సిద్దిపేట నుంచి సుమారు 2 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న కేదార్‌నాథ్ ధామానికి దేశం నలుమూలల నుంచి ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, బీహార్ రాష్ట్రాలతో పాటు నేపాల్ తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు దర్శనానికి వస్తుంటారు.గౌరికుండ్ నుంచి సుమారు 16 కిలోమీటర్ల ఎత్తైన పర్వత మార్గాన్ని అధిరోహించి భక్తులు కేదార్‌నాథ్ ఆలయానికి చేరుకుంటారు. ఈ కఠినమైన యాత్రలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిద్దిపేటకు చెందిన సేవా బృందం నిరంతరం అండగా నిలుస్తోంది.



**"దాతల సహకారంతో సేవలను విస్తరిస్తున్నాం"**

2019లో 50 మంది సభ్యులతో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం ప్రస్తుతం 150 మందికి పైగా సభ్యులతో కొనసాగుతోంది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులకు ఉచితంగా టిఫిన్స్, భోజనం, స్నాక్స్ అందిస్తున్నాం. దాతల సహకారం, సభ్యుల సేవాభావమే మా బలం. భక్తుల ఆశీస్సులతో సేవలను మరింత విస్తరిస్తున్నాం.

**- చికోటి మధుసూదన్**
**కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు**



**"భక్తులకు సేవ చేయడం మా అదృష్టం"**

సిద్దిపేట నుంచి వచ్చి హిమాలయాల్లో భక్తులకు సేవ చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం. కఠినమైన వాతావరణ పరిస్థితుల్లోనూ సభ్యులంతా అంకితభావంతో పనిచేస్తున్నారు. వేలాది మంది యాత్రికులకు భోజనం, టిఫిన్స్, తాగునీరు అందించడం ద్వారా పరమశివుడి సేవ చేసే అవకాశం లభించడం గొప్ప భాగ్యంగా భావిస్తున్నాం.

**- గోపిశెట్టి శరభయ్య**
**కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితికోశాధికారి**

**2019లో ప్రారంభం..**
**నేడు 150 మందితో సేవలు**

2019లో కేవలం 50 మంది సభ్యులతో ప్రారంభమైన కేదార్‌నాథ్ అన్న సేవా సమితి ప్రస్తుతం 150 మందికి పైగా సభ్యులతో విస్తరించింది. ప్రతి సంవత్సరం యాత్ర సీజన్ ప్రారంభానికి ముందే అవసరమైన ఆహార సామగ్రి, వంట సామగ్రిని సిద్దిపేట నుంచి తరలించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ ఏడాది కూడా ఏప్రిల్ 14న సరుకులతో కూడిన లారీని పంపగా, మాజీ మంత్రి టి. హరీష్ రావు ప్రారంభించారు.

సోన్‌ప్రయాగ్ పార్కింగ్ ప్రాంతంతో పాటు కేదార్‌నాథ్ ఆలయం సమీపంలో కూడా అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఉదయం 4 గంటల నుంచి రాత్రి 1 గంట వరకు భక్తులకు ఉచితంగా టీ, టిఫిన్స్, భోజనం, తాగునీరు అందిస్తున్నారు.

**ఆధ్యాత్మిక యాత్రలో సేవా యజ్ఞం**

చార్‌ధామ్ యాత్రలో అత్యంత పవిత్రమైన క్షేత్రంగా పేరుగాంచిన కేదార్‌నాథ్ ధామంలో భక్తులకు సేవ చేయడాన్ని సమితి సభ్యులు తమ అదృష్టంగా భావిస్తున్నారు. మంచు పర్వతాలు, చలి, వర్షాలు, ఆక్సిజన్ కొరత వంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ సేవా కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగిస్తున్నారు.



**"దేశవ్యాప్తంగా మా సేవలకు మంచి గుర్తింపు లభిస్తోంది"**

కేదార్‌నాథ్ యాత్రకు వచ్చే భక్తుల సౌకర్యార్థం సోన్‌ప్రయాగ్‌తో పాటు ఆలయం సమీపంలో కూడా అన్నదాన శిబిరాలు నిర్వహిస్తున్నాం. భక్తులకు అవసరమైన ఆహారం, తాగునీరు అందిస్తూ సేవ చేస్తున్నాం. తెలంగాణ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం ఆనందంగా ఉంది.

**- అయిత రత్నాకర్**
**కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి ప్రధాన కార్యదర్శి**



# రైతులకు లారీల సమస్య తీర్చేందుకు పరిశ్రమలకు చేరుకున్న అధికారులు

**చిన్న శంకరంపేట జూన్ 1**
**ఆశ్వి అప్డేట్స్...**

చిన్న శంకరంపేట మండలంలోని పలు గ్రామాలలో దాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు లారీలు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు, విషయం తెలుసుకున్న చిన్న శంకరం పెడతా ఐసిల్దార్ మాలతి ఎస్సై శివానందం తమ సిబ్బందితో పరిశ్రమల వద్దకు చేరుకొని రైతుల సమస్యలు తీర్చేందుకు లారీలను కొనుగోలు కేంద్రాల పంపించారు చిన్న శంకరంపేట మండలంలోని ఖాజాపూర్ కావేరి పరిశ్రమలో లారీలు ఉన్న విషయాన్ని తెలుసుకున్న అధికారులు పరిశ్రమ వద్దకు చేరుకొని వివిధ గ్రామాల కొనుగోలు కేంద్రాల వద్దకు లారీలను పంపించారు, ఈ సందర్భంగా తహశీల్దార్ మాలతి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్దకు లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కుప్పలు పేరుకు పోతున్నాయి రైస్ మిల్లులలో లారీలు తొందరగా దిగుమతి కాకపోవడంతో లారీల సమస్య రావడం జరుగుతుందని రైతులకు సమస్య రాకూడదని ఉద్దేశంతో పరిశ్రమల వద్దకు వెళ్లి లారీలను కొనుగోలు కేంద్రాలు పంపించడం జరుగుతుందని తెలిపారు, రైతులు అధైర్య పడకుండా ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని కొనుగోలు కేంద్రాల వద్దకు లారీలను పంపించి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు, ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాలతి, తో పాటు ఎస్సై శివానందం, ఆర్ ఐ రాజు, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇరవై ఏండ్లు తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**గజ్వేల్ మే జూన్ 1**
**ఆశ్వి అప్డేట్స్)**



విద్యాలయాన్ని వదిలి ఇరవై ఏండ్లు పూర్తి చేసుకున్నారు. ఎవరికి వారు వ్యక్తిగత జీవితంలో ఉండిపోవడంతో విద్యార్థి దశనాటి మధుర జ్ఞాపకాలను ఆత్మీయంగా పంచుకోవడానికి ఒక వేదికను ఏర్పాటు చేసుకున్నారు. ఆ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుని రోజంతా సంతోషంగా గడిపారు

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 20052006 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఇరవై సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఉన్నత స్థానాలకు ఎదిగిన తమ పూర్వ విద్యార్థులను చూసి గురువులు ఆనందించారు. జీవితంలో ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు. తమపై విద్యార్థుల ప్రేమాభినాలు ఎల్లప్పుడు ఉండాలని కోరుకున్నారు విద్యార్థినీవిద్యార్థులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.విద్యార్థి దశలో గురువులతో మెలిగిన సందర్భాలను తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ఉపాధ్యా యులను పూల దండలువేసి శాలువాతోసత్కరించి, మెమోంటోలను అందజేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్ రెడ్డి, విగ్నేశ్వర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రహీం, లచ్చిరెడ్డి, శ్యామ్యూల్, రవికుమార్, నరేందర్ రెడ్డి, ఈ కార్యక్రమ ఏర్పాటుకు అందరితో సమన్వయం చేసిన గ్రామ సర్పంచ్ (పూర్వ విద్యార్థి)ప్రభాకర్,నిజాం, రఫీ,బి రమేష్, వై రమేష్, నరేష్,రజిని, తేజ, భాగ్య లను మిత్రులు అభినందించారు. వారితో పాటు మనోహర, పద్మ, శోభా, కల్పన యాదగిరి,శ్రీకాంత్, మధుసూదన్ రెడ్డి,సత్య పాల్ రెడ్డి,వేంకట్ గౌడ్ నరేందర్ కనకరాజ్ రాజు,మహేందర్ తో పాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# పాడుబడ్డ బావుల వద్ద ప్రజలు జాగ్రత్తగా ఉండాలి...

- ఎస్సై శివానందం

**చిన్న శంకరంపేట జూన్ 1, ఆశ్వి అప్డేట్స్**

గ్రామాల్లో ఉన్నటువంటి పాడు బడ్డ బావుల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిన్న శంకరంపేట శివానందం తెలిపారు. చిన్న శంకరంపేట మండలం మిర్జాపల్లి గ్రామ శివారులోని రైల్వే స్టేషన్ సమీపంలో పాడుబడ్డ బావిలో ఓ వ్యక్తి పడిపోవడం జరిగిందని గ్రామస్తుల సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చిన్న శంకరంపేట ఎస్సై శివానందం తన సిబ్బందితో కలిసి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు వెంటనే అగ్నిమాపక సిబ్బంది తోపాటు అంబులెన్స్ కు సమాచారం అందించారు, వెంటనే అగ్నిమాపక సిబ్బంది పాడుపడ్డ బావి దగ్గరికి చేరుకొని బావిలో పడిపోయిన వ్యక్తిని రక్షించి గాయాల పాలైన రైల్వే పనులలో కూలీగా పనిచేస్తున్న భాస్కర్ ను ఆస్పత్రికి తరలించారు ఈ సందర్భంగా ఎస్సై శివానందం మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న పాడు బడ్డ బావుల వద్దకు వెళ్లకుండా ఉండాలని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు మిర్జాపల్లి శివారులో ఓ వ్యక్తి బావిలో పడిపోయాడని గ్రామస్తుల సమాచారం మేరకు బావి వద్దకు చేరుకొని బావిలో పడ్డ భాస్కర్ ను రక్షించి గాయాల పాలైన అతనిని 108 అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

# సత్ఫలితలు ఇస్తున్న ధాన్యం సేకరణ

- 9.31 లక్షల మంది రైతులకు రూ.11,500 కోట్లు చెల్లింపు .

**తిరుమలగిరి (సూర్యాపేట), జూన్ 1.**



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణ కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందని, ఇప్పటికే కొనుగోలు కేంద్రాల నుంచి అధిక శాతం నిల్వలను రైస్ మిల్లులకు తరలించామని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

ఈ రోజు క్షేత్రస్థాయి తనిఖీని కొనసాగిస్తూ, ఉత్తమ్ కుమార్ రెడ్డి సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి, ఫణిగిరిలోని సేకరణ కేంద్రాలను సందర్శించారు. కొనుగోళ్ల వేగం, నిల్వల తరలింపు, రవాణా ఏర్పాట్లు, రైతులకు చెల్లింపులను ఆయన సమీక్షించారు.

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్, జిల్లా అధికారులు, పౌర సరఫరాల సిబ్బందితో కలిసి మంత్రి, యాసంగిలో కొనసాగుతున్న సేకరణ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న అధికారులు, రైతులతో మాట్లాడారు.

“భారీ సేకరణ ప్రక్రియ సత్ఫలితాలనిస్తోంది. పెద్ద మొత్తంలో వరి ధాన్యాన్ని ఇప్పటికే మిల్లులకు తరలించడంతో, సేకరణ కేంద్రాలపై ఒత్తిడి తగ్గింది. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము,” అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

రాష్ట్రంలో వరి కొనుగోళ్ల కోసం ఏర్పాటు చేసిన నెట్‌వర్క్‌లలో ఇదే అతి పెద్దదని, తెలంగాణ ఇప్పటి వరకు 8,575 సేకరణ కేంద్రాల ద్వారా దాదాపు 64 లక్షల మెట్రిక్ టన్నుల (LMT) ధాన్యాన్ని సేకరించామని ఆయన తెలిపారు.

రైతులకు న్యాయమైన ధర అందేలా చూడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అన్నారు. అందుకే, అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న వరిని కూడా కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

“వర్షంలో తడిసిన వరిని కూడా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చివరి గింజను కొనుగోలు చేసే వరకు ప్రభుత్వం వారికి అండగా ఉంటుంది,” అని ఆయన అన్నారు. సూర్యాపేట జిల్లాతో సహా వివిధ జిల్లాల్లో సేకరణ కార్యకలాపాలు సజావుగా సాగేలా కృషి చేసిన కలెక్టర్లు, ఎమ్మెల్యేలు మరియు పౌర సరఫరాల బృందాలను ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశంసించారు. జూన్ మొదటి వారం చివరి నాటికి సూర్యాపేటలో కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నల్గొండ జిల్లాకు కూడా ఇదే విధమైన సూచనలు జారీ చేశామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే 9.31 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి నేరుగా రూ.11,500 కోట్లు బదిలీ చేసిందని ఆయన చెప్పారు. గతంలో చెల్లింపులకు వారాలు లేదా నెలలు పట్టేదని, కానీ ఇప్పుడు రైతులకు 48 నుంచి 72 గంటల్లోపే డబ్బు అందుతోందని ఆయన తెలిపారు. రవాణా కొరతను అధిగమించడానికి, కొనుగోలు పూర్తయ్యే వరకు వరి రవాణా కోసం అందుబాటులో ఉన్న అన్ని లారీలు, భారీ వాహనాలను వినియోగించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించిందని మంత్రి తెలిపారు. కేంద్రం యొక్క కొనుగోలు విధానాన్ని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ 75 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉండగా, కేంద్ర ప్రభుత్వం కేవలం 51 లక్షల మెట్రిక్ టన్నులకు మాత్రమే అంగీకరిస్తోందని, దీంతో రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడుతోందని ఆయన అన్నారు. తెలంగాణ దేశంలోనే అగ్రగామి వరి ఉత్పత్తి రాష్ట్రంగా అవతరించిందని, భారతదేశ యాసంగి వరి సేకరణలో దాదాపు 63 శాతం వాటా తెలంగాణదేనని మంత్రి తెలిపారు. మిగిలిన కొనుగోళ్లు అనుకున్న సమయానికి పూర్తవుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే, మొత్తం సరుకులను కొనుగోలు చేసి మిల్లులకు తరలించే వరకు ప్రభుత్వ యంత్రాంగం రేయింబవళ్లు పనిచేస్తూనే ఉంటుందని రైతులకు హామీ ఇచ్చారు.



## ఆర్మీకి ఎంపికైన యువకుడికి సన్మానం

- రైతు బిడ్డ ఆర్మీలో ఎంపిక గ్రామస్థులు హర్షం

**అక్బరుపేట భూంపల్లి (ఆశ్వి అప్డేట్స్)**

సరిహద్దుల్లో సైనికులు కాపలా కాస్తున్నారు కాబట్టే, మనం ఇక్కడ ప్రశాంతంగా నిద్రపోతున్నాం అని సర్పంచ్ బాల మల్లేశం గౌడ్ అన్నారు.ఆదివారం అక్బరుపేట భూంపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జంగం భాను ప్రసాద్ ఆర్మీ ఉద్యోగానికి ఎంపిక కావడంతో సర్పంచ్ బాల మల్లేశం గౌడ్, ఉపసర్పంచ్ కనుకరాజు పాలకవర్గం, గ్రామస్థులు శనివారం శాలువా తో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని యువకులు ప్రభుత్వ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఉద్యోగాలకు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా పథకం

**అశ్వి అప్డేట్స్ :**




జూన్ రెండవ తేదీ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభ అవార్డుల్లో జిల్లా పోలీసులకు ఉత్తమ సేవా పతకం, సేవ పతకాలు లభించాయి.

జిల్లా అదనపు ఎస్పీ గ్రామ బాధ్యతలు నిర్వహిస్తున్న యు రవీందర్ రెడ్డికి రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా పతకం లభించింది. సిసిఎస్ ఏఎస్ఐ వెంకన్న, డిసిఆర్బి కానిస్టేబుల్ శ్రీధర్, ఏఆర్ కానిస్టేబుల్ కృష్ణయ్య, ఏఆర్ కానిస్టేబుల్ మధుమోహన్ లకు సేవా పథకాలు వచ్చాయి..

ప్రతిభ అవార్డులు పొందిన సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు అభినందించారు. ఉత్తమ సేవలకు ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని అన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని సేవలు అందించాలని కోరారు.



## సంగారెడ్డి మున్సిపాలిటీ 19 వ వార్డులో ఇందిరమ్మ గృహ ప్రవేశం లో పాల్గొన్న టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

**సంగారెడ్డి, ఆశ్వి అప్డేట్స్**

సంగారెడ్డి పట్టణం లోని 19 వ వార్డులో ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం లో నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ గ్రామం, పట్టణం తేడా లేకుండా ఇల్లు లేని పేదలందరూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారన్న రు.

ఈ కార్యక్రమంలోజాయింట్ కలెక్టర్ సంగీత, మున్సిపల్ చైర్మన్ కూన వనితా సంతోష్, వార్డు కౌన్సిలర్ గుర్రం ఝాన్సి రమేష్, నాయకులు కూన సంతోష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు. పాల్గొన్నారు

## మైనర్ బాలిక ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ చేయండి

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి –
- మహిళలు, బాలికలకు రక్షణ కల్పించాలి
- కె. కాశీనాథ్
- సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు




**నారాయణపేట, ఆశ్వి అప్డేట్స్**

నారాయణపేట జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న మైనర్ బాలిక అశ్విని ఆత్మహత్య ఘటన అత్యంత విషాదకరమైనది, బాధాకరమైనది మరియు ఆందోళన కలిగించేదిగా ఉందని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు కె. కాశీనాథ్ పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని ఆయన డిమాండ్ చేశారు.బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు మరియు స్థానికులు చేస్తున్న ఆరోపణల ప్రకారం ప్రేమ పేరుతో మోసపోయిన కారణంగా తీవ్ర మనోవేదనకు గురైన మైనర్ బాలిక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు నిష్పాక్షికంగా, పారదర్శకంగా దర్యాప్తు నిర్వహించి, ఎవరి ప్రమేయమైనా ఉన్నట్లు తేలితే వారిపై సంబంధిత చట్టాల కింద కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.మైనర్ బాలికల భద్రత, గౌరవం, విద్య మరియు భవిష్యత్తును కాపాడటం సమాజం, ప్రభుత్వం మరియు పోలీసు వ్యవస్థ యొక్క బాధ్యత అని ఆయన అన్నారు. బాలికలను మోసం చేయడం, వేధించడం, బెదిరించడం లేదా మానసిక ఒత్తిడికి గురిచేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా వేగవంతమైన దర్యాప్తు చేపట్టి, అవసరమైన న్యాయ మరియు మానసిక సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాలు, గ్రామాలు మరియు పట్టణాల్లో మహిళల భద్రతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. యువతలో, విద్యార్థుల్లో చట్టాలపై, మహిళల గౌరవం మరియు భద్రతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన శిక్షలు అమలు చేయడం ద్వారా మాత్రమే ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేయగలమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై జిల్లా యంత్రాంగం, పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు.





# నెరవేరిన దశాబ్దాల సొంతింటి స్వప్నాలు...

- ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అట్టహాసంగా ప్రారంభోత్సవాలు...
- లష్కర్ గూడ, గండిచెరువులో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి....
- పేదల ముఖాల్లో ఇవాళ్టి చిరునవ్వే నా అసలైన విజయం: ఎమ్మెల్యే మల్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా అశ్వి అప్డేట్స్ :**

ఏళ్ల తరబడిగా ఎదురుచూస్తున్న సొంతంటి స్వప్నం ఎట్టకేలకు సాకారమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం తొలి విడతలో భాగంగా నిర్మించిన గృహప్రవేశాలు అట్టహాసంగా జరిగాయి. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మొదటి దఫాలో 3,500 ఇళ్లు మంజూరు కాగా... అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల ద్వారా అర్హులను ఎంపిక చేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి..., ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభోత్సవాలు జరగ్గా.... ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోనూ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా అబ్దుల్లా పూర్ మెట్ మండలం లష్కర్ గూడ, గండిచెరువు గ్రామాల్లో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ నూతన గృహాలను అందంగా ముస్తాబు చేసి, వేడుకలు జరుపుకున్నారు. గృహప్రవేశ కార్యక్రమానికి తమ ఇంటికి అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి నూతన గృహాలు ప్రారంభించారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి చూసి ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు భావోద్వేగానికి గురయ్యారు. జీవితకాలంలో సొంతిల్లు కట్టుకుంటామా అనే సందిగ్ధంలో ఉన్న తమకు గూడు నిర్మించిన ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన నాటికంటే పేదల ముఖాల్లో ఆనందాన్ని చూసిన ఈ రోజే తనకు అసలైన విజయంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. అర్హుల్లో మిగిలిన వారందరినీ గుర్తించి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన హామీఇచ్చారు. సామాజిక న్యాయం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్న మల్ రెడ్డి.... మాటలతో మాయచేసే రాజకీయ మాంత్రికులను ప్రజలు దూరం పెట్టాలని సూచించారు.

## మహేశ్వరం మండలంలో వైభవంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం

- పేదలకు సొంతింటి కల నిజం చేసిన ప్రజా ప్రభుత్వం

**మహేశ్వరం, అశ్వి అప్డేట్స్ :**

మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలంలోని పలు గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న లక్ష్మారెడ్డి KLR మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు.గతంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లక్షలాది మంది పేదలకు నీడ లభించింది. అదే సంకల్పంతో నేడు ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోంది.నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేదవానికి ఇల్లు దక్కేలా చూసే బాధ్యత మాది. అని తెలిపారు.పదవులు ఉన్నా లేకపోయినా, మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటూ, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను నేరుగా ప్రజల వద్దకు చేర్చడమే కాంగ్రెస్ నాయకత్వ లక్షణమని ఆయన స్పష్టం చేస్తారు.

ఈ కార్యక్రమంలో జడ్పిటిసిలు, మాజీ జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు మాజీ ఎంపీటీసీలు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, వార్డ్ మెంబర్లు,కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు..





## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన తహసిల్దార్, మున్సిపల్ చైర్మన్

**రామాయంపేట**
**జూన్ 1**
**ఆశ్వి అప్డేట్స్...**




జొన్నలు పండించిన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోని విక్రయించుకోవాలని క్వింటాల్కు 3600 మద్దతు ధర లభిస్తుందని మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ తెలిపారు రామాయంపేట మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ లావణ్య నాగరాజు గుప్తా తహసిల్దార్ రజనీ కుమారీ లు ప్రారంభించారు, ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పంట మార్పిడి విధానాన్ని ప్రోత్సహించాలని విధంగా జొన్నలకు మంచి మద్దతు ధర ప్రకటించిందని క్వింటాలుకు 3600 చెల్లించడం జరుగుతుందని రైతులు జొన్న పంట వైపు మొగ్గు చూపాలని ప్రత్యామ్నాయ పంటలను పండించుకోవాలని ఆయన రైతులకు సూచించారు. రైతులు తాము పండించిన జొన్నలను మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న మండలాల రైతులు రామాయంపేట మార్కెట్ కమిటీ కార్యాలయానికి తీసుకువచ్చి విక్రయించుకోవాలని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లావణ్య నాగరాజు గుప్తా తహశీల్దార్ రజనీకుమారి మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు పిఎసిఎస్ చైర్మన్ బాదే చంద్రం,తదితరులు పాల్గొన్నారు.

## 'పెద్ది'లో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటన ఒక దృశ్య కావ్యం: మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ, ఆశ్వి అప్డేట్స్**

విజయవాడలో జరిగిన పెద్ది సినిమా ప్రీరిలీజ్ వేదికగా ఏపీ ప్రభుత్వ 'సినిమా' విధానాన్ని ప్రకటించిన సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ (అసోసియేట్ ఎడిటర్ K.S.CHARY) :ఆంధ్ర దేశం నడిబొడ్డున, విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం సాక్షిగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తేజ్, గ్లామర్ డాల్ జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' ప్రిరిలీజ్ ఈవెంట్ అత్యంత వైభవంగా, జనసందోహం మధ్య జరిగింది. ఈ మెగా ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ చిత్ర యూనిట్‌ను అభినందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన ముఖ్య విశేషాలు సినిమా పండితులను, మెగా అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. "చెన్నైలో పుట్టి, హైదరాబాద్‌లో పెరిగిన రామ్ చరణ్‌కు రూరల్ బ్యాక్‌డ్రాప్ కొత్త అయినప్పటికీ, 'రంగస్థలం' చిత్రంలోనే ఆయన నటనలోని పరిపక్వత ఏంటో నిరూపితమైంది. ఇలాంటి ఒక రస్టిక్, పీరియాడిక్ ఫిల్మ్‌లో నటించడం అంత సామాన్యమైన విషయం కాదు. దీని వెనుక చరణ్ కఠోర దీక్ష, శ్రమ, అంకితభావం స్పష్టంగా కనిపిస్తున్నాయి. నటన అనేది ఆయన రక్తంలోనే ఉంది, మెగా లెగసీని ఆయన అద్భుతంగా కంటిన్యూ చేస్తున్నారు." అని కొనియాడారు. "నాడు మెగాస్టార్ చిరంజీవి, అతిలోక సుందరి శ్రీదేవిల కాంబినేషన్ వెండితెరపై జగదేక వీరుడు అతిలోక సుందరి సినిమా రూపంలో ఒక హిస్టరీ క్రియేట్ చేసింది. నేడు వారి వారసులుగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ ల జంట తెరపై చూడముచ్చటగా ఉంది. జాన్వీ కపూర్ లుక్ చాలా బాగుంది, ఆమెలో శ్రీదేవి ప్రతిరూపం కనిపిస్తోంది. ఈ జోడీ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయం." అని ఉత్సాహపరిచారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన మ్యూజిక్, సాంగ్స్ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని, సినిమాలో జగపతి బాబు పాత్ర మైండ్ బ్లోయింగ్ హైలైట్ కాబోతుందని మంత్రి కొనియాడారు. తూర్పుగోదావరికి చెందిన దర్శకుడు బుచ్చిబాబు సానా ఎంతో సింపుల్ గా ఉంటూనే, క్రికెట్, రెజ్లింగ్ నేపథ్యంలో ఈ పీరియాడిక్ సినిమాను ఒక ప్రభంజనంలా తెరకెక్కించారని ప్రశంసించారు. ఈ అద్భుతమైన ప్రాజెక్ట్‌ను నిర్మించిన సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ అధినేతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**ఏపీలో షూటింగులు జరపండి.. సింగిల్ విండో అనుమతులు ఇస్తాం!:మంత్రి దుర్గేష్**

"డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో నేను సినిమాటోగ్రఫీ మంత్రిగా మీ ముందుకు వచ్చాను. సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చిత్ర పరిశ్రమ అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉంది. ఇలాంటి పెద్ద సినిమాలు ఆడితే వందలాది సినీ కార్మికుల కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో షూటింగ్‌లు జరుపుకోవాలని, డబ్బింగ్, రికార్డింగ్, రీరికార్డింగ్ థియేటర్ల వంటి మౌలిక వసతులను ఇక్కడ ఏర్పాటు చేయాలని పరిశ్రమ వర్గాలను ఆహ్వానించారు. ప్రభుత్వం తరపున 'సింగిల్ విండో' పద్ధతి ద్వారా అన్ని అనుమతులు వేగంగా ఇస్తాం. దీనివల్ల లోకల్ టాలెంట్‌కు మంచి అవకాశాలు దక్కుతాయని స్పష్టం చేశారు. చివరగా, 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద అఖండ విజయం సాధించి, సూపర్ డూపర్ హిట్ కావాలని, చిత్ర యూనిట్ మొత్తానికి మంచి భవిష్యత్తును అందించాలని మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు.









## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ పరేడ్ రిహార్సల్‌స్‌ను పరిశీలించిన వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, IPS

**ఆశ్వి అప్డేట్స్ తెలంగాణ క్రైమ్ బ్యూరో చీఫ్ :**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జూన్ 2వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించబోయే అధికారిక కార్యక్రమాల కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పరేడ్ యొక్క రిహార్సల్‌స్‌ను వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఈ రోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పరేడ్ ప్రదర్శనను దగ్గరుండి గమనించిన ఎస్పీ గారు, వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, క్రమశిక్షణతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, విధుల్లో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. రిహార్సల్స్ అనంతరం ఎస్పీ గారు మాట్లాడుతూ "తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం అనేది రాష్ట్ర ప్రజలందరికీ ఎంతో పవిత్రమైన, గర్వకారణమైన రోజు. ఈ వేడుకల్లో పోలీస్ శాఖ తరపున నిర్వహించే పరేడ్ అత్యంత ఆకర్షణీయంగా, గౌరవప్రదంగా ఉండాలి. కవాతులో పాల్గొనే ప్రతి ఒక్క పోలీస్ అధికారి, సిబ్బంది తమ వృత్తి పరమైన నైపుణ్యాన్ని, క్రమశిక్షణను ప్రదర్శించాలి. సమయపాలన పాటిస్తూ, అంకితభావంతో పనిచేసి పరేడ్‌ను విజయవంతం చేయాలి. వికారాబాద్ జిల్లా పోలీస్ పక్షాన ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని రకాల బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశాం" అని పేర్కొన్నారు. అనంతరం వేదిక పరిసర ప్రాంతాలను, ట్రాఫిక్ నియంత్రణ మార్గాలను పరిశీలించిన ఎస్పీ గారు, అధికారులకు పలు కీలక సూచనలు జారీ చేశారు. వేడుకలకు వచ్చే ప్రజాప్రతినిధులు, విఐపిలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, వాహనాల పార్కింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపినారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించే అమరవీరుల స్తూపం వద్దకూ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున, కట్టుదిట్టమైన, బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ గారు అధికారులను ఆదేశించారు. అక్కడ ఎలాంటి ఇబ్బంది కల్గకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. బందోబస్త్ తో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపినారు. ఇట్టి కార్యక్రమం లో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, AR డీఎస్పీ వీరేష్, వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్, RI నాగరాజు, ఇతర అధికారులు పాల్గొనడం జరిగింది.

# హైదరాబాద్ ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ ముట్టడి

- **మాజీ సర్పంచ్ ల సంఘం రాష్ట్ర JAC కమిటీ**
- **ర్యాలీగా క్యాంప్ ఆఫీస్ వైపు వెళ్లుండగా జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వద్ద పోలీస్ లు అరెస్ట్**

**అశ్వి అప్డేట్స్ :**




2019నుండి 2024వరకు జరిగిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు 531కోట్ల రూపాయలు వెంటనే విడుదల చెయ్యాలి అని రేవంత్ రెడ్డి ప్రభుత్వాని డిమాండ్ చేస్తున్నా సర్పంచుల JAC అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్.రాష్ట్ర మాజీ సర్పంచుల సంఘం JAC అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి అప్పుల పాలైన మాజీ సర్పంచుల బాధలు వర్ణనాతీతమని సర్పంచుల సంఘం రాష్ట్ర JAC అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ అన్నారు. గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు చేసి దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చి దిద్దిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం హేయమైన చర్య అని అన్నారు.మొన్నటికి మొన్న యాదాద్రి భువనగిరి జిల్లా అమనాపూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ గ్రామ పంచాయతీ పనులను కృష్ణ అనే సర్పంచ్ పనులు చేసి అప్పుల పాలయి కటుంబం హాత్మ హత్య చేసుకోవడం జరిగింది. ఆ కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలి అని డిమాండ్ చేస్తున్నాము పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఏడాదిన్నర కాలంగా అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని రాష్ట్రవ్యాప్తంగా ఆయాగ్రామలలో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన 531 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సర్పంచుల కుంటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా అని ఆవేదన వ్యక్తం చేశారు..వందల కోట్ల రూపాయల బకాయిలు ఉంటే 153 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవడం ఏమిటని ప్రశ్నించారు.అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, పెండింగ్ బిల్లులు విడుదల చేసేంత వరకు సర్పంచుల పోరాటం ఆగదని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి కేశబోయిన మల్లయ్య,వరంగల్ నుండి సంగని సూరయ్య, మోడెం విద్యాసాగర్, రాంపక నాగయ్య,బోట్ల రవీందర్, ఊర రవీందర్ రావు, బొంపెల్లి రాజేశ్వర్ రావు,బొడ్డు నర్సీములు, నందిగామ ప్రసాద్, మన్నే పద్మారెడ్డి, ఇటుకలా కుమార స్వామి, శెంకర్ నాయక్,మాదాసు రవి,బాధవత్ రవి, రాకేష్,సంఘారెడ్డి జిల్లా బాద్యులు అరవింద్,రావుల రాజిరెడ్డి,రామ్ ప్రసాద్, రాంచేందర్ రెడ్డి భాస్కర్,తదితరులు పాలుగోన్నారు




## ప్రో కబడ్డీ లీగ్‌కు సిద్దిపేట క్రీడాకారుడు 'లారెన్' ఎంపిక

- **జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.సి. సంతోష్ హర్షం**
- **యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి**

**గజ్వేల్, జూన్ 01, (ఆశ్వి అప్డేట్స్)**

సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్‌కు చెందిన ప్రముఖ కబడ్డీ క్రీడాకారుడు లారెన్ ప్రతిష్టాత్మక ప్రో కబడ్డీ లీగ్ కు ఎంపిక కావడం పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.సి. సంతోష్ తీవ్ర సంతోషాన్ని, హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా నుంచి జాతీయ స్థాయి ప్రో కబడ్డీ లీగ్‌కు లారెన్ ఎంపిక కావడం జిల్లాలోని యువ క్రీడాకారులందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అందిస్తున్న నిరంతర ప్రోత్సాహం, నాణ్యమైన శిక్షణ వల్లే లారెన్‌కు ఈ అరుదైన అవకాశం దక్కిందన్నారు. కఠిన శ్రమ, క్రమశిక్షణ ఉంటే అనుకున్న ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని, యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. లారెన్ ప్రస్తుతం కేరళలో జరుగుతున్న కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాడని, ఆ పోటీలు ముగిసిన అనంతరం త్వరలోనే తెలంగాణకు తిరిగి వస్తాడన్నారు. ప్రో కబడ్డీ లీగ్‌లో అడుగు పెడుతున్న లారెన్‌కు ఈ సందర్భంగా ఎన్.సి. సంతోష్ ప్రత్యేక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే జిల్లాలో కబడ్డీ అభివృద్ధికి కృషి చేస్తున్న అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శివకుమార్ కు మరియు జిల్లా కమిటీ సభ్యులందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# గజ్వేల్‌లో బీజేపీకి షాక్..

- **పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కమ్మారి శ్రీనివాస్ రాజీనామా-**

**గజ్వేల్ జూన్ 01 ( ఆశ్వి అప్డేట్స్)**



గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకుడు కమ్మారి శ్రీనివాస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు రాజీనామా లేఖను పంపించారు. వ్యక్తిగత కారణాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి వైదొలుగుతున్నట్లు ఆయన తన లేఖలో పేర్కొన్నారు. పార్టీ పట్ల తనకు ఉన్న గౌరవాన్ని వ్యక్తం చేస్తూనే, వ్యక్తిగత పరిస్థితుల కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వెల్లడించారు.

కమ్మారి శ్రీనివాస్ రాజీనామాతో గజ్వేల్ నియోజకవర్గంలో బీజేపీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావుకు నమ్మినబంటుగా పార్టీకి సేవలు చేశారు. కాగా వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నాను అంటూనే రేపు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరుతున్నట్టు ఆయన అనుచరుల తో సమాచారం.

ఈ పరిణామం స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. భారతీయ జనతా పార్టీ నాయకత్వం ఆయన రాజీనామాపై ఎలా స్పందిస్తుందన్నది ఆలోచించాల్సిన విషయమే.

# ఆహార భద్రతా తనిఖీలను ముమ్మరం చేయాలి

- **జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.**

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 1**




జిల్లా వ్యాప్తంగా ఆహార భద్రత తనిఖీలను మరింత ముమ్మరం చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆహార వ్యాపార సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన చోట జరిమానాలు విధించాలని కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ లో తన ఛాంబర్ లో జరిగిన జిల్లా స్థాయి సలహా కమిటీ (District Level Advisory Committee DLAC)సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్లలో ఆహార భద్రత ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆమె సూచించారు. ప్రస్తుతం మామిడి పండ్ల సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో కృత్రిమ పక్వానికి (Artificial Ripening) పాల్పడే వ్యాపారులపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. కాల్షియం కార్బైడ్ వంటి నిషేధిత రసాయనాలను ఉపయోగించి పండ్లను పక్వానికి తెచ్చే వారిపై తనిఖీలు నిర్వహించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారుల సమన్వయంతో పట్టణంలోని పండ్ల గోదాములను తనిఖీ చేయాలన్నారు. వినియోగదారులకు సురక్షితమైన పండ్లు అందేలా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా, ఆహార వ్యాపార సంస్థల యజమానులు తప్పనిసరిగా FSSAI లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందాలని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ప్రతి నెల ఫుడ్ సేఫ్టీ కార్యాలయంలో లైసెన్స్/రిజిస్ట్రేషన్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన ఆహార వ్యాపారులు కార్యాలయాన్ని సందర్శించి లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మౌనిక నారాయణపేట జిల్లాలో ఆహార భద్రత అమలు, నిర్వహించిన తనిఖీలు, సేకరించిన నమూనాలు, ఆహార వ్యాపార సంస్థలపై తీసుకున్న చర్యలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక గురించి కలెక్టర్‌కు క్లుప్తంగా వివరించారు. అలాగే జిల్లాలో ఆహార భద్రతను మరింత బలోపేతం చేసేందుకు చేపడుతున్న చర్యలను సమావేశంలో వివరంగా తెలియజేశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు, సంబంధిత విభాగాల ప్రతినిధులు జిల్లా ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను, డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయ చంద్రమోహన్, జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు పోలీసుల సెర్మోనియల్ గార్డ్ రిహార్సల్స్ పరిశీలించిన అదనపు ఎస్పీ (డీఏఆర్) ఎం.డి. రియాజ్ హుల్ హక్

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 1**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించి సెర్మోనియల్ గార్డ్ రిహార్సల్‌స్‌ను అదనపు ఎస్పీ (డీఏఆర్) ఎం.డి. రియాజుల్ హక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సెర్మోనియల్ గార్డ్ సిబ్బంది నిర్వహించిన కవాతును, గౌరవ వందనం ప్రక్రియను నిశితంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని, ఈ వేడుకలను అత్యంత గౌరవప్రదంగా, క్రమశిక్షణతో నిర్వహించాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉందన్నారు. గార్డ్ ఆఫ్ ఆనర్‌లో పాల్గొనే సిబ్బంది సమయపాలన, ఏకరూపత, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంటీవో, ఆర్ఐ, విజయ్ భాస్కర్, ఆర్ఎస్ఐ శివశంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్

**తెలంగాణ క్రైమ్ బ్యూరో చీఫ్:**

నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ IPS ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 46 మంది బాధితులు తమ సమస్యలు, భూ వివాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు మరియు ఇతర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను ఎస్పీకి అందజేశారు.

ప్రతి ఫిర్యాదును జిల్లా ఎస్పీ పరిశీలించి, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి సమస్యలను త్వరితగతిన చట్టప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడిన ఎస్పీ గారు, ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా ముందుకు రావాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా విచారించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని తెలిపారు.




## కాళేశ్వరం సరస్వతి అంత్య పుష్కరాలలో పాల్గొన్న మంత్రులు

- **ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**అశ్వి అప్డేట్స్ :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో నిర్వహించిన సరస్వతీ నది అంత్య పుష్కరాలు మే 21న ప్రారంభమై జూన్ 1న అత్యంత వైభవంగా ముగిశాయి. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో ఈ పుష్కరాలు 12 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. పుష్కరాల ముగింపు సందర్భంగా రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు , రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గ , ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ విప్ మరియు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు , రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ (ఎంఎస్ రాజ్ ఠాకూర్), భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ తదితరులు కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించి, తీర్థప్రసాదాలు అందుకున్నారు. గోదావరి, ప్రాణహిత, సరస్వతి (అంతర్వాహిని) నదుల త్రివేణీ సంగమమైన కాళేశ్వరంలో పుష్కరాల ముగింపు సందర్భంగా నిర్వహించిన గంగా హారతి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.





# వేగంగా బరువు తగ్గడానికి బెస్ట్ టిప్స్..!



బరువు తగ్గడం అనేది అనుకున్నంత సులువు కాదు. అలాగని అంత కష్టమూ కాదు. చాలామంది బరువు తగ్గడం కోసం తెగ తంటాలు పడుతుంటారు. జిమ్‌ల వెంట, వేట్ రిడక్షన్ సెంటర్ల వెంట పరుగులు పెడుతుంటారు. అయితే అవేవీ అవసరం లేకుండా ఈ కొన్ని టిప్స్ పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయని నిపుణులు చెప్తున్నారు.

ప్రతిరోజు ఉదయం నిద్ర లేచిన వెంటనే రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లను తాగాలి. ఆ తర్వాత ఒక గంట సేపు వాకింగ్ చేసినా, లేదా ఒక ముప్పావు గంట మనకు తెలిసిన వ్యాయామం, ఎక్సర్‌సైజ్ చేసినా మంచి ఫలితం ఉంటుంది. మనకు మనం స్వయంగా ప్రతిరోజు ఉదయం ఈ అలవాటు చేసుకుంటే బరువు తగ్గే అవకాశాలు పెరుగుతాయి. అలాగే.. పీచు పదార్థం అధికంగా ఉండే ఆహారాలు బరువు తగ్గడానికి తోడ్పడతాయని అధ్యయనాలు చెప్తున్నాయి. పిండి పదార్థాలను తీసుకోవడం బాగా తగ్గించాలి. వాటికి బదులు ఆరోగ్యకరమైన ఆహారాలు తీసుకోవడం మంచిది. భోజనానికి అరగంట ముందు పావు లీటర్ నీళ్లు తాగితే.. తక్కువ కేలరీలు తినడానికి, 44% ఎక్కువ బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

ఇక.. బరువు తగ్గాలని భావించేవారు ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. డీప్ ఫ్రై చేసిన ఆహారాలను తినకుండా ఆయిల్ కంటెంట్ తక్కువగా ఉండే ఆహారాలను తింటే మంచిది. స్వీట్లకు దూరంగా ఉండాలి. ఆరోగ్యకరంగా బరువు తగ్గడానికి కీరా దోసకాయ, క్యారెట్, బీట్రూట్ వంటి వాటిని ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది. లో కేలరీ పండ్లల్లో యాపిల్ చాలా ముఖ్యమైనది. ఇందులోని ఫైబర్ , వాటర్ కంటెంట్ బరువు తగ్గేందుకు ఉపయోగపడుతుంది. ఇంకా వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉండే పుచ్చకాయ, పైనాపిల్, స్ట్రాబెర్రీ, ద్రాక్షతో పాటు జామ పండ్లను కూడా తీసుకోవచ్చు. ఆకు కూరల్లో విటమిన్ సీ, విటమిన్ కే ఉంటాయి. బరువు తగ్గడానికి ఇవి చాలా బాగా ఉపయోగపడతాయి. కొత్తిమీర, పుదీనా కూడా చాలా మంచిది. చిప్స్, బిస్కెట్స్, చాక్లెట్లు లాంటి చిరుతిళ్లను, స్నాక్స్‌ను కొంత కాలంపాటు దూరం పెట్టాలి. వాటికి బదులుగా పల్లీలు, పాప్‌కార్న్, మొలకలు, శెనగలు తింటే శరీరానికి కావలసిన పోషకాలు అందడమే కాకుండా బరువు తగ్గుతారు.

నెమ్మదిగా తినడం వల్ల కూడా బరువు తగ్గే అవకాశం ఉంది. అప్పుడే సరిగా జీర్ణక్రియ పని చేస్తుంది. ప్రతీ రోజూ కంటి నిండా నిద్రపోయినప్పుడు మాత్రమే బరువు పెరిగే సమస్యలు తలెత్తవు. లేకుంటే హార్మోన్ పనితీరుల్లో మార్పు వచ్చి ఆకలిని పెంచుతుంది. తక్కువగా నిద్రపోవడం, ఆకలి ఎక్కువ కావడం వల్ల ఎక్కువగా తిన్నప్పుడు సులభంగా బరువు పెరుగుతారు. కనుక బరువు తగ్గాలి అని భావించేవారు తప్పనిసరిగా ఈ నియమాలు, ఆహారపు అలవాట్లను చేసుకుంటే సరిపోతుంది.

# శాకాహారులు ఎక్కువగా ఉన్న దేశాలివే!

భారతదేశంలో మాంసాహార ప్రియుల సంఖ్య రోజురోజుకు అధికమవుతోంది. మాంసాహారం తినడంలో తెలంగాణ టాప్‌లో ఉంది. తెలంగాణలో గత లెక్కల ప్రకారం కేవలం 2శాతం మాత్రమే శాకాహారులు ఉన్నారు. అయితే ఇండియాలో చాలా మంది శాఖాహారులు కూడా మాంసాహారులుగా మారుతున్నారు. కానీ ప్రపంచవ్యాప్తంగా మాత్రం భారీ సంఖ్యలో మాంసాహారులు సైతం శాకాహారులుగా మారుతున్నారు. ఏది ఏమైనప్పటికీ.. ఎవరు ఎలా మారినప్పటికీ.. శాకాహారం తినడమా, మాంసాహారం తినడమా అనేది పూర్తిగా వ్యక్తిగత ఎంపికనే చెప్పాలి. అయితే ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా చలా మంది ఇప్పుడు శాకాహారాన్ని అవలంభిస్తున్నారని అంటుంటారు. లైఫ్ స్టైల్ ఛేంజ్ లో భాగంగా ఆహారపు అలవాట్లనూ మారుస్తున్నారు. కొంతమంది హెల్త్ కాన్సియష్ కాస్త ఎక్కువగా ఉండి కూడా ఇలాంటి నిర్ణయాలు చేస్తున్నారని చెబుతుంటారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా శాకాహారుల సంఖ్య పెరుగుతుందని అంటుంటారు. ఈ నేపథ్యంలో ప్రపంచం వ్యాప్తంగా శాకాహారులు ఎక్కువగా ఉన్న టాప్ 5 దేశాలను ఒకసారి పరిశీలిద్దాం...!

భారతదేశం: అత్యధిక సంఖ్యలో శాకాహారం తినేవారు ఎక్కువగా ఉన్న దేశాల్లో అగ్రస్థానంలో ఉంది భారత్. ఇక్కడ ఉన్న జనాభాలో సుమారు 30శాతం మందికి పైగా ప్రజలు శాకాహారమే తింటారని చెబుతున్నారు. ఈ శాతంలో ప్రధాన వాటా హర్యానా, రాజస్థాన్ లలో నివసిస్తున్న ప్రజలని అంటుంటారు! ఇజ్రాయెల్: ఇజ్రాయెల్ జనాభాలో సుమారు 13 శాతం మంది ప్రజలు శాకాహారులే. మనిషి తన ఆకలిని తీర్చుకోవడానికి జంతువులను చంపడాన్ని సమర్థించలేమని ఇక్కడ నివసించే కొంతమంది ప్రజానికం బలంగా నమ్ముతారంట.తైవాన్: శాఖాహర ఆహారాన్ని భుజించే జనాభా ఎక్కువగా ఉన్న దేశాల్లో తైవాన్ మూడో స్థానంలో ఉంది. ఇక్కడున్న మొత్తం జనాభాలో 12 శాతం మంది ఇక్కడ శాకాహారాన్నే అనుసరిస్తున్నారు. ఇక్కడ వెజ్ రెస్టారెంట్స్ చాలానే ఉన్నాయి.

ఇటలీ: ఇటలీ జనాభాలో సుమారు 10 శాతం మంది ప్రజలు వెజిటేరియన్స్. వాస్తవానికి ఇటలీ నాన్ వెజ్ వంటకాలకు ఎక్కువ ప్రసిద్ధి చెందినప్పటికీ.. ఇక్కడ శాకాహారుల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోందని తాజా నివేదికలు చెబుతున్నాయి.ఆస్ట్రియా: ప్రపంచ వ్యాప్తంగా శాకాహర ఆహారాన్ని అనుసరించే వ్యక్తుల విషయంలో ఆస్ట్రియా ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ సుమారు 9 శాతం మంది ప్రజలు కూరగాయలను తినేందుకే ఇష్టపడుతున్నారు.





# టాటూల వల్ల వచ్చే ప్రమాదాలు ఇవే



వయసుతో సంబంధం లేకుండా ఇప్పుడు టాటూలు వేయించుకునే వారి సంఖ్య పెరిగిపోయింది. చర్మం కాస్త తేటగా ఉంటే చాలు... అక్కడ ఏదో ఒక టాటూ వేయించుకోవాలన్న కోరిక పెరిగిపోతోంది. ఎక్కువ మంది చేతులపై, భుజాలపై టాటూలను వేయించుకుంటున్నారు. న్యూయార్క్‌లోని బింగ్‌హామ్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు వల్ల ఆరోగ్యం పై ఎలాంటి ప్రభావం కనిపిస్తుందో తెలుసుకునేందుకు అధ్యయనం నిర్వహించారు. అమెరికాలోని చలామణిలో ఉన్న తొమ్మిది టాటూ ఇంక్ బ్రాండ్లను విశ్లేషించారు. వాటిలో 45 రకాల సమ్మేళనాలు ఆరోగ్య సమస్యలతో ముడిపడి ఉన్నట్టు తేలింది. ఆ 45 సమ్మేళనాల పేర్లను కూడా బహిర్గతం కానివ్వలేదు. ప్రజలు తమకు తెలియకుండానే టాటూలతో చర్మ సమస్యలను, ఆరోగ్య ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నట్టు అధ్యయనకర్తలు చెబుతున్నారు.





## ● ఆరోగ్య సమస్యలు

నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ చెబుతున్న ప్రకారం టాటూ ఇంకులో పాలిథిన్ గ్లైకాల్ అనే రసాయనం ఉంటుంది. ఇది కొన్ని రకాల ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడుతుంది. అలాగే మరొక రసాయనం ఇందులో ఉంది. దాని పేరు 2ఫినాక్సిథెనాల్ కొన్ని టాటూ ఇంకులలో ఈ ప్రమాదకరమైన పదార్థాన్ని గుర్తించారు. ఈ రసాయనం అధిక మోతాదులో చర్మంలోనికి ఇంకితే... చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు, కాలేయ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అలాగే మూత్రపిండాలు, నరాలకు కూడా హాని కలుగుతుంది.టాటూల్లోని రసాయనాలు దీర్ఘకాలంలో ఆరోగ్యం పై ప్రభావాన్ని చూపిస్తాయి. అవి చర్మం ద్వారా శరీరంలోకి ఇంకుతాయి. శరీరం నుంచి ఇతర అవయవాలకు కూడా చేరే అవకాశం ఉంది. కాబట్టి వీలైనంత వరకు టాటూలకు దూరంగా ఉండటమే మంచిది.

## ● చెమట గ్రంథులు సరిగా పనిచేయవు

గతంలో కూడా టాటూలపై అనేక అధ్యయనాలు జరిగాయి. అందులో కూడా పరిశోధకులు ఇలాంటి అభిప్రాయాన్ని చెప్పారు. టాటూల వల్ల చర్మంలోని చెమట గ్రంథులకు నష్టం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. చెమట గ్రంథులు శరీరాన్ని చల్లబరచడం కోసం చెమటను ఉత్పత్తి చేసి బయటకి పంపిస్తాయి. దీనివల్ల మన శరీరంలో తగినంత ఉష్ణోగ్రత మాత్రమే ఉంటుంది. అయితే టాటూలు వేయించుకున్న చోట చెమట గ్రంథులు సరిగా పనిచేయవు. పచ్చబొట్టు ఉన్న ప్రాంతంలో ఒకలా, పచ్చబొట్టు లేని ప్రాంతంలో ఒకలా చెమట గ్రంథులు పనిచేస్తాయి.







# యాలుకలు అతిగా తింటే అంతే..!

యాలుకలు.. ప్రపంచవ్యాప్తంగా వంటశాస్త్రంలో వీటికంటూ ఓ ప్రత్యేక స్థానం ఉంది. దాదాపు ప్రతి దేశం కూడా వాటి వంటకాల్లో దాదాపు అన్నింటిలో యాలుకలను వినియోగిస్తాయి. వీటిని వినియోగించడం వల్ల మన వంటకు ప్రత్యేకమైన ఫ్లేవర్, సువాసన రావడమే కాకుండా ఎన్నో ఆరోగ్య లాభాలను కూడా అందిస్తుంది. ప్రతి రోజూ యాలుకలు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, మన ఆరోగ్యానికి అండగా ఉండే సత్తా ఈ చిట్టి-పొట్టి యాలుకలకు ఉందని నిపుణులు అంటున్నారు. అయితే వీటిని అతిగా తీసుకోవడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉంటాయంటున్నారు. ఇంతకీ యాలకలతో ఉండే ప్లస్‌లు మైనల్‌లు ఏంటో చూద్దాం..





యాలుకలు మన జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. అజీర్ణం, ఉబ్బరం నుంచి ఉపశమనం అందిస్తుంది. దాంతో పాటుగా మన రోగనిరోధక శక్తిని పెంచి.. ఆర్థరైటిస్, కీళ్లనొప్పులను తగ్గించడంలో ఉపయోగపడతాయి. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ మన శరీరాన్ని ఒత్తిడి నుంచి రక్షిస్తుంది. కణాలకు ఎటువంటి నష్టం కలుగకుండా వాటిని కాపాడుతాయి. ఈ యాంటీఆక్సిడెంట్లు మన మొత్తం ఆరోగ్యాన్ని ఒక కంట కనిపెట్టి ఉంచుతాయి. వీటిలో మన గుండె పదిలంగా ఉండటానికి కూడా యాలుకలు ఎంతగానో ఉపయోగపడతాయని, రక్తం గడ్డకట్టడాన్ని నివారించడం, రక్త ప్రసరణ సజావుగా సాగేలా చేస్తాయి. బరువు తగ్గడంలో కూడా ఇవి మనకు ఎంతగానో ఉపయోగపతాయి. కొవ్వును కరిగించడంలో యాలుకలకు ప్రత్యేక స్థానం ఉంది. ఆకలిని అణచివేయడం, ఏదో ఒకటి తినాలని అనిపించే జివ్వ కోరికలను తగ్గించడంలో ఇవి బాగా పనిచేస్తాయి.ప్రతిరోజూ 4 నుంచి 10 యాలుకల వరకు తినొచ్చని, వీటి సంఖ్య కాస్తంత అటూ ఇటూ అయినా పర్లేదు కానీ.. ఏదో ఉద్యమంలా వీటిని తింటే మాత్రం తిప్పలు తప్పవని వైద్య నిపుణులు చెప్తున్నారు. రోజూ వీటిని అధిక సంఖ్యలో తినడం వల్ల మన జీర్ణ వ్యవస్థపై నెగిటివ్ ఇంపాక్ట్ పడుతుంది. డయేరియా, పొత్తికడుపు నొప్పి, తలతిరగడం, వాంతులు కావడం వంటివి రావొచ్చు. హైబీపీకి కూడా కారణం కావొచ్చు. హార్మోనల్ ఇన్‌బ్యాలెన్స్ కావడం వల్లే అనేక సమస్యలు వస్తాయి. వీటితో పాటుగా యాలుకలను అతిగా తినడం వల్ల శరీరం చెక్కబారు తనంగా మారే అవకాశాలు కూడా ఉన్నాయని నిపుణులు చెప్తున్నారు. ఒకవేళ ఇలాంటి లక్షణాలను మీరు గనుక గమనిస్తే డాక్టర్ల దగ్గరకు పరిగెత్తాల్సిన అవసరం లేదని, మీరు తినే యాలుకల సంఖ్యను తగ్గిస్తే సరిపోతుందని నిపుణులు చెప్తున్నారు. యాలుకలు తినడం తగ్గించినా ఈ సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించడం ఉత్తమం అని సూచిస్తున్నారు.

# నోరూరించే చికెన్ సీఖ్ కబాబ్ రెసిపీ..

చికెన్ సీఖ్ కబాబ్.. సౌతాసియాలో ఫేమస్ డిష్. దీనిని చికెన్, గొర్రె మాంసంతో యారు చేస్తారు. సీఖ్ కబాబ్ లు మెత్తగా, జ్యూసీగా ఉంటాయి. అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, కారం, గరం మసాలా వంటి వివిధ మసాలా దినుసులు దానిపై వేయాలి. అలాగే, నిమ్మరసం, కొత్తిమీర, పుదీనా ఆకులు చాలా రుచిగా ఉంటాయి. శాకాహార సీఖ్ కబాబ్ లు భా రతదేశంలో ప్రసిద్ధి చెందాయి. వీటిని శెనగపిండి, గుజ్జరి, బంగాళాదుంపలు, కాలీఫ్లవర్, పచ్చి బఠానీలతో తయారుచేస్తారు. మరి నోరూరించే ఈ కబాబ్ ఎలా తయారు చేయాలో చూద్దామా..



చికెన్ కీమాను శుభ్రంగా కడిగి పక్కడ పెట్టుకోవాలి. ఒక పెద్ద గిన్నెలో ఆ మాంసాన్ని సన్నగా తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి తరుగు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి కలపాలి. కొత్తిమీర తరుగు, పుదీనా ఆకులు, జీలకర్ర, ధనియాల పొడి, గరం మసాలా, పసుపు, కారం పొడి మొదలైనవి. పదార్థాలన్నీ కలిసే వరకు బాగా కలపాలి. అందులో ఒక గుడ్డు కొట్టి వేసి కలపాలి. గిన్నెను కవర్ చేసి ఈ మిశ్రమాన్ని కనీసం 30 నిమిషాల పాటు ఫ్రిజ్ లో మ్యారినేట్ చేయాలి. ఇప్పుడు చికెన్ మిశ్రమాన్ని తీసి చిన్న ముద్దను తీసి కబాబ్ ఆకారంలో ఒత్తుకోవాలి. దాన్ని పుల్లకు గుచ్చుకోవాలి. దాన్ని ఎయిర్ ఫ్రైయర్ లో, ఓవెన్ లో ఉడికించాలి. లేదా కళాయిలో నూనె వేయాలి. అందులో ఈ పుల్లలను ఉంచి కాల్చాలి. కబాబ్ లు గోధుమ రంగులోకి వచ్చే వరకు ఉడికించాలి. అంతే టేస్టీ చికెన్ సీక్ కబాబ్ రెసిపీ అయినట్టే. వండిన తర్వాత సీక్ కబాబ్ లను స్కేవర్ల నుంచి తీసి వేడివేడిగా సర్వ్ చేయాలి. వీటితో పాటు పుదీనా చట్నీ, పెరుగు సాస్ లేదా సైడ్ సలాడ్ కలిపి తింటే అతిథులు ఆనందిస్తారు.



| |
|---|
| కావాల్సిన పదార్థాలు |
| చికెన్ కీమా - అర కిలో |
| ఉల్లిపాయ - రెండు |
| పచ్చిమిర్చి - మూడు |
| అల్లం వెల్లుల్లి పేస్ట్ - రెండు స్పూన్లు |
| కొత్తిమీర తరుగు - పావు కప్పు |
| పుదీనా ఆకుల తరుగు - పావు కప్పు |
| జీలకర్ర - ఒక స్పూను |
| ధనియాల పొడి - ఒక స్పూను |
| గరం మసాలా - ఒక స్పూను |
| పసుపు - అర స్పూను |
| గుడ్డు - ఒకటి |
| ఉప్పు - రుచికి సరిపడా |
| కారం - ఒక స్పూను |
| తయారీ విధానం |

# చికాకుగా అనిపించినా.. వాస్తవమిదే!



"మీ విలువ మీ రూపం పై ఆధారపడి ఉంటుంది, విజయాలపై కాదు అనే సందేశమిస్తున్నారా?" అంటూ సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేస్తున్న వారిపై మండిపడ్డారు బాలీవుడ్ సీనియర్ నటి మాధురి దీక్షిత్. ఆమె, కథానాయిక త్రిప్తి దిమ్రీ, ధర్ణ దుర్గా ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'మా బెహెన్'. ఈ నెల 5న ఓటీటీ వేదికగా ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలోనే మాధురి, త్రిప్తి ఓ ఇంటర్వ్యూలో సామాజిక మాధ్యమాల్లో నటీమణులపై వస్తున్న ట్రోల్స్ గురించి తమ వ్యక్తిగత అభిప్రాయాల్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ... "ఐశ్వర్య 20 ఏళ్లుగా కేన్స్ చిత్రోత్సవాలకు హాజరవుతున్నారు. దేశం మొత్తానికి గర్వ కారణంగా నిలిచిన వ్యక్తి ఆమె. అలాంటి ఆమెను దుస్తులు, ఆకృతి లాంటి ఇతరత్రా వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకుని మరి వ్యాఖ్యలు చేస్తున్నారు. అలా చేసి ఆమె స్థాయిని తగ్గించలేరు. అలాంటి వ్యక్తులపై ట్రోల్స్ చేసేవారు నేటి యువతకు ఎలాంటి సందేశం ఇస్తున్నారో గ్రహించాలని అనుకుంటున్నాను. మీ విలువ మీ రూపం పై ఆధారపడి ఉంటుంది, విజయాలపై కాదు అనే సందేశం ఇస్తున్నారా? ఇది పూర్తిగా తప్పుదోవ పట్టించే సందేశం. ఇది వరకు కూడా ఇలాంటివి ఉండేవి కానీ, ఇప్పుడు ప్రతి చిన్న విషయాన్ని కంటెంట్‌గా మార్చుతున్నారు. ఇది కొంచెం చికాకుగా అనిపించినా.. నేటి వాస్తవమిదే" అన్నారు.

త్రిప్తి మాట్లాడుతూ.. "ఇంట్లో కూర్చుని ఇతరులపై వ్యాఖ్యలు చేయడం చాలా సులభం. కానీ, వారి స్థానంలో ఉండి ఆలోచిస్తే దాని వెనుక పడిన కష్టం గురించి తెలుస్తుంది. అనన్య లేదా ఐశ్వర్య అయినా.. వారిద్దరూ తమ జీవితంలో చాలా కష్టపడ్డారు. ఏదైనా ఒక పని కోసం మన సమయం, శ్రమని వెచ్చించినప్పుడు దాని ఫలితం విషయంలో కొంచెం భయం ఉంటుంది. సినిమా విడుదలకు ముందు ఇంతే. ప్రేక్షకులు కూడా డబ్బులు చెల్లించి మీ పనిని చూస్తున్నారు. కాబట్టి అది వారికి నచ్చకపోతే దానిపై వ్యాఖ్యానించే హక్కు ఉంటుంది. కానీ, ఆ విషయం కాకుండా దాన్ని మరేదైనా విషయంతో ముడి పెట్టినప్పుడు అది నాకు చికాకు కలిగిస్తుంది" అని అంది త్రిప్తి.

# అల్లు అర్జున్ 'రాకా'లో మలయాళ నటి..



అల్లు అర్జున్ హీరోగా కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రం 'రాకా' (Raaka). ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఇందులో మలయాళ నటి ఫెమినా జార్జ్ భాగమయ్యారు. ఇటీవల ఓ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఫెమినా.. తాను ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో చేరినట్లు స్వయంగా వెల్లడించారు. "నేను అసలు 'రాకా' లాంటి పెద్ద ప్రాజెక్ట్‌లో భాగమవుతానని ఊహించలేదు. నా కెరీర్‌లో ఇప్పటివరకు చేసిన వాటిల్లో ఇది అత్యంత భారీ సినిమా. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటానని ఎప్పుడూ అనుకోలేదు. ఆయన నటించిన 'హ్యాపి' నేను (Femina George) చూసిన మొదటి అల్లు అర్జున్ చిత్రం. అప్పటినుంచే ఆయనకు పెద్ద ఫ్యాన్ అయ్యాను. ఈ సినిమాలో నా పాత్ర నిడివి చిన్నదే అయినా.. ఇంత గొప్ప ప్రాజెక్ట్‌లో భాగం కావడం కల నిజమైనట్లుగా ఉంది" అని ఫెమినా జార్జ్ తెలిపారు. తాను ఇటీవల 'డిస్కో' సినిమా షూటింగ్ పూర్తి చేసుకోగానే 'రాకా' టీమ్ నుంచి ఫోన్ వచ్చిందని ఆమె చెప్పారు. మోడల్ అయిన ఫెమినా 2021లో నెట్‌ఫ్లిక్స్ సూపర్ హీరో చిత్రం 'మిన్నల్ మురళి'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు.

ఇన్‌స్టాలో వచ్చే వాటిలో 90 శాతం అబద్ధాలే: బాబీ దేవోల్

ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఫెమినా కూడా భాగమయ్యారు. దీంతో ఎప్పటినుంచో వస్తున్న వార్తలకు మరింత బలం చేకూరుతోంది. ఇందులో నలుగురు హీరోయిన్స్ ఉంటారని, అందరూ కీలకపాత్రల్లో కనిపిస్తారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. జాన్వీ కపూర్, రష్మిక పేర్లు కూడా ఇటీవల తెరపైకి వచ్చాయి. దీనిపై టీమ్ స్పందించాల్సి ఉంది. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.



# అరసన్ చిత్రంలో ప్రియాంక?

వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ.. దక్షిణాది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది అందాల తార ప్రియాంక మోహన్. గతేడాది 'ఓజీ'తో అలరించిన ఈమె.. ఈ ఏడాది 'మేడ్ ఇన్ కొరియా'తో ప్రశంసలు దక్కించుకుంది. ఇప్పుడు ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. హీరో శింబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'అరసన్'. వెట్రిమారన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో విజయ్ సేతుపతి ప్రతినాయకుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో కథానాయికగా ప్రియాంక మోహన్‌ను ఎంపిక చేసే పనిలో పడిందట చిత్రబృందం. ప్రస్తుతం ఈ విషయంపైనే చర్చలు జరుగుతున్నాయని, త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుందని ప్రియాంక సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'తో పాటు కవిన్ సరసన మరో చిత్రంలో నాయికగా బిజీగా ఉంది.

# 'రొమియో జూలియట్' రిలీజ్ డేట్ ఫిక్స్..

యంగ్ హీరో హర్షిత్ రెడ్డి, గ్లామరస్ బ్యూటీ విశాక ధిమన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రొమియో జూలియట్'. భార్గవ మాచర్ల దర్శకత్వం వహించగా.. నవరస ఎంటర్‌టైన్‌మెంట్స్, డాలీ స్టూడియోస్, ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ బ్యానర్స్‌పై నిర్మాతలు సందీప్, వెంకటేశ్వర రావు చల్లగుల్ల సంయుక్తంగా ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ మొత్తాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ సినిమా రిలీజ్ డేట్‌ను చిత్రబృందం తాజాగా అధికారికంగా ప్రకటించింది. జూలై 31న ఈ 'రొమియో జూలియట్' చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు అనౌన్స్ చేశారు. ఈ రిలీజ్ డేట్ ప్రకటనతో పాటు చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక డిఫరెంట్ పోస్టర్ ప్రస్తుతం నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది.



# చిన్నప్పటి నుంచి ఆయనపై నాకు పెద్ద క్రష్ ఉండేది

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ భూమి పెడ్నేకర్ వైవిధ్యమైన పాత్రలు చేస్తూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంటారు. ఇక ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. దాదాపు పదేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉన్న లవర్ బాయ్ ఇమ్రాన్ ఖాన్ గ్రాండ్ కమ్‌బ్యాక్ ఇస్తున్న నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ ఫిల్మ్ 'అధూరే హమ్ అధూరే తుమ్' లో భూమి పెడ్నేకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రం గురించి, ఇమ్రాన్ ఖాన్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం గురించి భూమి పెడ్నేకర్ రీసెంట్‌గా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పలు విశేషాలు పంచుకున్నారు. "నేను ఇండస్ట్రీలోకి రాకముందు, చిన్నప్పటి నుంచే ఇమ్రాన్ ఖాన్‌ను చూస్తూ పెరిగాను. ఆయనపై నాకు చాలా పెద్ద క్రష్ ఉండేది. ఆయన నటించిన రొమాంటిక్ సినిమాల్లో ఇమ్రాన్ క్యారెక్టర్స్ ఎంతో పద్ధతిగా, పర్ఫెక్ట్‌గా ఉండేవి. ఈ కాలంలో అలాంటి మంచి లవ్ స్టోరీస్ ఎవరూ తీయడం లేదు. ఈ సినిమా కథ వినగానే నాకు చాలా బాగా నచ్చింది. ఇది ఎంతో పరిణతి చెందిన కథ" అని భూమి ఎంతో ఆనందంగా చెప్పుకొచ్చారు.


ఇక ఈ సినిమా కథ ఒక వివాహిత జంట మధ్య వచ్చే సమస్యలు, వారి రిలేషన్‌షిప్‌లోని ఇబ్బందుల చుట్టూ తిరుగుతుందని టాక్. కేవలం లవ్ స్టోరీ మాత్రమే కాకుండా, పెళ్లి తర్వాత బంధాన్ని నిలబెట్టుకోవడంలో ఉండే ఎమోషన్స్, గొడవలను ఇందులో చూపించబోతున్నారట. ఇక ఈ సినిమాకు సంబంధించి ముంబైలో ఒక అదనపు షూటింగ్ షెడ్యూల్‌ను కూడా చిత్ర యూనిట్ ఇటీవల పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను డైరెక్టర్ డానిష్ అస్లాం తెరకెక్కిస్తున్నారు. గతంలో ఇమ్రాన్ ఖాన్, దీపికా పదుకొణె కాంబినేషన్‌లో వచ్చిన 'బ్రేక్ కే బాద్' సినిమాను కూడా ఈయనే డైరెక్ట్ చేశారు. అప్పట్లో ఆ మూవీలోని ఎంతో పాపులర్ అయిన ఒక సాంగ్ లైన్ ఆధారంగానే ఇప్పుడు ఈ కొత్త చిత్రానికి 'అధూరే హమ్ అధూరే తుమ్' అనే టైటిల్ పెట్టడం విశేషం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలోనే నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానున్నట్లు సమాచారం.



# రామ్ చరణ్ ఫ్యాన్స్‌కు ఇక పూనకాలే.. 'పెద్ది' ప్రీమియర్ షోస్ బుకింగ్స్ ఓపెన్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, బుచ్చిబాబు సన డైరెక్షన్ తెరకెక్కుతున్న హైవోల్టేజ్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' విడుదలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. జూన్ 4న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతున్న నేపథ్యంలో ఏపీ సర్కార్ బంపరాఫర్ ఇచ్చింది. ఈ సినిమా గ్రాండ్ రిలీజ్‌కు ఒకరోజు ముందే, అంటే జూన్ 3 రాత్రి నుంచే ఏపీలో ప్రత్యేక ప్రీమియర్ షోల ప్రదర్శనకు పర్మిషన్ ఇచ్చింది.

ఈ క్రమంలోనే ఇవాళ మధ్యాహ్నం 3 గంటల నుంచే ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అడ్వాన్స్ బుకింగ్స్ అధికారికంగా ఓపెన్ అయ్యాయి. జూన్ 3న రాత్రి 8 గంటల నుంచే ఏపీలోని ప్రముఖ థియేటర్లలో 'పెద్ది' ప్రీమియర్ షోలు పడనున్నాయి. ఈ ప్రత్యేక షోలకు సంబంధించిన టికెట్ ధరను జీఎస్టీతో కలిపి గరిష్టంగా రూ.600గా నిర్ణయించారు. జూన్ 4 నుంచి మొదటి 10 రోజుల పాటు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్‌పై రూ.100, మల్టీప్లెక్స్‌లలో రూ.125 అదనంగా పెంచుకునేందుకు హోంశాఖ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఇక థియేటర్లలో రోజుకు 5 ఆటలు ప్రదర్శించుకునేందుకు కూడా ఏపీ ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది




# ఆ సినిమా విషయంలో దర్శకుడి ప్లాన్ మొత్తం మార్చేశాను..



దిల్ రాజు తన కెరీర్‌లో ఎన్నో విజయవంతమైన సినిమాలను నిర్మించిన విషయం తెలిసిందే. ఆయన నిర్మించిన చిత్రాల్లో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిపోయిన సినిమాల్లో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు ఒకటి. ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్, సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోలుగా నటించగా అంజలి, సమంత హీరోయిన్లుగా కనిపించారు. శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు నిర్మించాడు.

ఈ చిత్రం 2013 సంక్రాంతికి విడుదలై భారీ విజయాన్ని అందుకుంది. ఒక ఇంటర్వ్యూలో భాగంగా ఈ సినిమా ప్రారంభానికి ముందు జరిగిన ఆసక్తికర విషయాన్ని దిల్ రాజు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. శ్రీకాంత్ అడ్డాల 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' కథ రాసుకున్న తర్వాత ఈ సినిమాను పూర్తిగా కొత్త నటీనటులతో తెరకెక్కించాలని అనుకున్నారు. అందులో భాగంగా నా దగ్గరకు వచ్చి కథ వినిపించారు. కథ మొత్తం విన్నాక కొత్త వాళ్లతో ఈ సినిమా వర్కౌట్ కాదని, స్టార్ హీరోలు ఉంటేనే మరింత బాగుంటుందని నేను సూచించాను.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in